J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 12
THE BEST TELUGU WEEKLY OF NELLOREANS





# లాయర్

సంపుటి : 41 సంచిక : 34 28.1.2022, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

## జిల్లాల పునర్విభజనతో...

# చిన్నబోయిన నెల్లూరు




### 3 తీసి 1 కలిపారు

### సర్వేపల్లి కూడా లేకుంటే.. సర్వం కోల్పోయి ఉండేది

**గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి ఇక బాలాజీ జిల్లాలో... నెల్లూరులో కలిసిన కందుకూరు**

**ప్రపంచ ప్రఖ్యాత రాకెట్ కేంద్రం, అంతర్జాతీయ ఖ్యాతి పొందిన చేనేత పరిశ్రమ, మైకా మైన్లు, సిలికా సిరులు, దేశంలోనే ప్రతిష్టాత్మక శ్రీసిటి, సూళ్లూరుపేట చెంగాళమ్మ గుడి... ఇవన్నీ ఇక శ్రీవారి పాదాల చెంతకే.**

ఎట్టకేలకు జిల్లాల పునర్విభజన ప్రక్రియను జగన్ ప్రభుత్వం పట్టాలెక్కించింది. ఎప్పటి నుండో జిల్లాల ఏర్పాటుపై కసరత్తు జరుగుతున్నప్పటికీ, ఇప్పుడు అకస్మాత్తుగా ఉన్నట్లుండి ఆ పనిని వేగవంతం చేసింది. రాబోయే ఉగాది కల్లా కొత్తజిల్లాల ఏర్పాటును పూర్తిచేసి పాలన సాగించే దిశగా జెట్ స్పీడుతో అడుగులు వేస్తోంది.

రాష్ట్రంలో ఇప్పటికే ఉన్న 13 జిల్లాలకు మరో 13 జిల్లాలను కలిపి మొత్తంగా 26 జిల్లాలను ప్రకటించారు. పార్లమెంటు నియోజకవర్గాలను ఆధారం చేసుకుని జిల్లాల పునర్విభజన జరుగు తుందని ప్రకటించినప్పటికీ, ప్రజాప్రతినిధులు, ఆయా ప్రాంతాల స్థానిక ప్రజల అభిప్రాయాల దృష్ట్యా అక్కడక్కడా స్వల్ప మార్పులతో జిల్లాల స్వరూపాన్ని నిర్ణయించారు.

10లో

# టెండరేస్తే.. బెండుతీస్తాం!

### ➤ ఇరిగేషన్ కాంట్రాక్టర్‌కి వార్నింగ్ ఇచ్చిన నెల్లూరు నేతలు

- హైదరాబాదు పోలీస్‌కి ఫిర్యాదు, కోర్టులో కేసు నమోదు..!
- ఇది నెల్లూరా..? లేక బీహారా..?? అని ప్రశ్నిస్తున్న సొంత పార్టీ శ్రేణులు


*82 కోట్ల రూపాయల పనికి అతి తక్కువగా 69 కోట్లకు టెండర్ వేసి ప్రభుత్వానికి 13 కోట్లు ఆదా చేసినందుకు ఇరిగేషన్ కాంట్రాక్టర్‌కి నేతల బెదిరింపులు. తక్కువ మొత్తానికి కోట్ చేసి పనిని ఆ కాంట్రాక్టర్ దక్కించుకోవడమే ఆయన చేసిన పాపం. ప్రభుత్వానికి డబ్బులు మిగల్చాలనుకోవడం ఆయన చేసిన అన్యాయంగా ఆ నేతలకు కనపడింది. ఇప్పుడు సదరు నేతల ఆదేశాల మేరకు నిబంధనలకు విరుద్ధంగా టెండర్‌ను రద్దు చేయడానికి అధికారులు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది.*

3లో

## నాటా అధ్యక్షుడిగా

# డాక్టర్ కొర్సపాటి శ్రీధర్‌రెడ్డి

10లో






# బడులను భయపెడుతున్న కరోనా

## • పలు స్కూళ్లలో టీచర్లకు, విద్యార్థులకు కోవిడ్

కరోనా రోజురోజుకీ ఉధృతంగా మారుతోంది. పాఠశాలల్లోనూ కోవిడ్ వైరస్ విజృంభిస్తోంది. దీంతో పాఠశాలలకు పిల్లలను పంపాలంటే తల్లితండ్రులు భయపడుతున్నారు. మర్రిపాడు జడ్పీ హైస్కూల్‌లో ఇటీవల నలుగురు ఉపాధ్యాయులు కరోనాకు గురికావడంతో వారు స్కూలుకు సెలవు పెట్టారు.



***నాయుడుపేటలో :*** నాయుడుపేటలోని సంజయ్‌గాంధీకాలనీలో ఉన్న ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడికి కరోనా సోకడంతో ఆ వ్యాధి వ్యాపించకుండా బడిలో అంతా క్లోరినేషన్ చేయించారు.

***రాపూరు మండలంలో :*** రాపూరు మండలంలోని గుండవోలు గ్రామంలోని ఒక పాఠశాలలో ఒక టీచర్‌కు, ఇద్దరు విద్యార్థులకు, గిలకపాడు స్కూల్‌లో ఇప్పటికే 8 మంది విద్యార్థులకు కోవిడ్ పాజిటివ్ రాగా, తాజాగా మరో ఇద్దరు ఉపాధ్యాయులకు కరోనా నిర్ధారణ అయింది.

***మర్రిపాడులో :*** మర్రిపాడు హైస్కూల్‌లో ముగ్గురు ఉపాధ్యాయులకు కరోనా రావడంతో స్కూలుకు సెలవు ప్రకటించారు. మర్రిపాడు తహశీల్దారుకు, మండల వైద్యాధికారికి కూడా కరోనా పాజిటివ్ వచ్చింది. దీంతో కరోనా వ్యాప్తిని నిరోధించడానికి చర్యలు తీసుకుంటున్నారు.

***కాదలూరులో :*** తడ మండలంలోని కాదలూరు ప్రాథమికోన్నత పాఠశాలలో 21 మందికి కరోనా పాజిటివ్ వచ్చింది. ఇద్దరు ఉపాధ్యాయులు, మరో 19 మంది విద్యార్థులు కరోనాకు గురైనట్లు తెలుస్తోంది. అధికారులు అప్రమత్తమై కరోనా కట్టడికి కృషి చేస్తున్నారు.


***వెంకటేశ్వరపురంలో :*** నెల్లూరులోని వెంకటేశ్వరపురం ప్రభుత్వ పాఠశాలలో సుమారు 20 మంది దాకా కరోనాతో బాధపడుతున్నారు. వీరిలో అయిదుగురు టీచర్లు, 15 మంది విద్యార్థులు ఉన్నట్లు సమాచారం. దీంతో పాఠశాలలోని వారందరికీ కరోనా పరీక్షలు చేయిస్తున్నారు.



# తనిఖీలతో తడాఖా చూపిన రవాణా శాఖ

## ○ 2 బస్సులు సీజ్... 24 కేసులు నమోదు

రవాణా కమిషనర్ ఆదేశాలతో జిల్లావ్యాప్తంగా రవాణా అధికారులు ఈనెల 22, 23 తేదీల్లో ముమ్మరంగా కాంట్రాక్ట్ క్యారేజీలను, వాహనాలను తనిఖీచేశారు. కావలి టోల్‌ప్లాజా వద్ద, వెంకటాచలం టోల్‌ప్లాజా వద్ద తనిఖీలు చేసి నిబంధనలు పాటించని వాహనాలను గుర్తించి 24 కేసులు నమోదు చేశారు. సీట్లను అనధికారికంగా మార్పు చేయడం, సరైనా బీమా లేకపోవడం, ప్రయాణీకుల జాబితా లేకుండా ప్రయాణీకులను తీసుకువెళ్తుండడం వంటి వాహనాలను గుర్తించి ఆ మేరకు చర్యలు తీసుకున్నారు. నిబంధనలను పాటించకుండా తిరుగుతున్న రెండు బస్సులను సీజ్ చేశారు. ఈ తనిఖీల్లో డిటిసి చందర్ తదితర అధికారులు పాల్గొన్నారు.



### వాత్సల్యకు ఇథాకా స్కూల్

# విద్యార్థుల చేయూత



నెల్లూరులోని వాత్సల్య నిరాధార బాలల ఆశ్రమానికి ఇథాకా స్కూల్ విద్యార్థులు మూడు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు అందించారు. కనుపర్తిపాడు వద్ద ఉన్న ఇథాకా స్కూల్‌లో ఇటీవల జరిగిన ఫన్‌ఫెయిర్ ద్వారా వచ్చిన డబ్బుతో విద్యార్థులు ఈ సాయం అందించినట్లు స్కూల్ జనరల్ మేనేజర్ జీవన్ తెలియజేస్తూ విద్యార్థులను అభినందించారు. వైస్ ప్రిన్సిపాల్ సరస్వతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### ఫిబ్రవరి 5,6 తేదీల్లో..

# బ్యాడ్మింటన్ పోటీలు

నెల్లూరులోని ఏసి సుబ్బారెడ్డి క్రీడామైదానంలో ఫిబ్రవరి 5,6 తేదీల్లో అండర్ 11, 13, 15, 17, 19 బాలబాలికల బ్యాడ్మింటన్ లీగ్ పోటీలు నిర్వహించనున్నామని బ్యాడ్మింటన్ కోచ్ జి.వెంకటేష్ ఒక ప్రకటనలో తెలిపారు. శాప్ ఆధ్వర్యంలో ఈ పోటీలు జరుగుతాయని, ఫిబ్రవరి 3వ తేదీ లోపు క్రీడాకారులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని, తమ వయస్సు ధృవీకరణ పత్రంతో పాటు కోవిడ్-19 రిపోర్టులు పంపాలని తెలిపారు. ఎంట్రీఫీజు 300రూపాయలు చెల్లించాలని, వివరాలకు 96669 98089 ఫోన్ నెంబరుకు సంప్రదించాలని కోరారు.

# రేషన్ బియ్యం పట్టుకున్నారు

నాయుడుపేట మండలంలోని పుదూరు గ్రామంలో అక్రమంగా నిల్వ చేసిన 29 బస్తాల రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. ఈనెల 26వ తేది రాత్రి ఎస్ఐ సిహెచ్ కృష్ణారెడ్డి వెళ్ళి పుదూరులో తనిఖీ చేయగా ఆ బియ్యం దొరికాయి. వీటిని అక్రమంగా రవాణా చేసేందుకు ప్రయత్నించిన వ్యక్తి సూళ్ళూరుపేటకి చెందిన వెంకటేశ్వర్లు అని తెలియడంతో ఆ వ్యక్తిపై పోలీసులు కేసు నమోదుచేశారు.

# టెండరేస్తే.. బెండుతీస్తాం!


(మొదటి పేజీ తరువాయి)

*ఒకరు సాక్షాత్తూ ఈ రాష్ట్ర మంత్రి. ఇంకొకరు నెల్లూరు నగర డెప్యూటీ మేయర్. వీళ్ళిద్దరూ కలిసి ఒక బడా కాంట్రాక్టర్‌కి వార్నింగ్ ఇచ్చారు. మాకు తెలియకుండా టెండర్ వేస్తావా... నీ అంతు చూస్తాం, నీ సంగతి తేలుస్తాం... అంటూ చిందులేశారు. అంతేకాదు పత్రికలలో రాయలేని నీచమైన భాషలో బూతు పురాణాలతో ధ్వజమెత్తినట్లు సమాచారం. అవతల వ్యక్తి ఏమైనా సామాన్యుడా అంటే.. అదీ కాదు. నెల్లూరు పార్లమెంటు సభ్యులు ఆదాల ప్రభాకరరెడ్డి, నగర మాజీ శాసనసభ్యులు జేకే రెడ్డిలకు స్వయానా మేనమామ కొడుకు. అంతేకాదు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఒక కీలక శాఖకు సలహాదారుగా ఉన్న ముఖ్యమంత్రి అత్యంత సమీప బంధువుకి వియ్యంకుడు కూడా.*


**వివరాలలోకి వెళ్తే...**

నెల్లూరు నగరంలోని పెన్నా పొర్లుకట్టకు సంబంధించిన పనికి నీటిపారుదల శాఖ అధికారులు 82 కోట్ల రూపాయలతో టెండర్లు పిలిచారు. సదరు పనిని దక్కించుకోవడం కోసం హైదరాబాదుకు చెందిన నిర్మాణ సంస్థ శ్రీ సాయికృష్ణ కన్‌స్ట్రక్షన్స్ తరఫున గునుపాటి మురళీకృష్ణారెడ్డి టెండర్ వేశారు. ప్రభుత్వం సూచించినదానికన్నా 13 కోట్ల రూపాయలు తక్కువ కోట్ చేయడంతో పని మురళీకృష్ణారెడ్డి సంస్థకే వచ్చింది. ఇక్కడే అసలు సమస్య మొదలయ్యింది. సదరు పనిని తనకు అత్యంత సన్నిహితుడైన కాంట్రాక్టర్‌కి ఇప్పించుకోవాలనుకున్న నీళ్ళ మంత్రి అనిల్‌కుమార్‌యాదవ్ బాబాయ్ రూప్‌కుమార్‌యాదవ్‌కి కోపం నషాళానికి అంటిందట. తన ఫోన్‌లో నుండే కాకుండా మంత్రి ఫోన్ నుండి కూడా మురళీకృష్ణారెడ్డికి ఫోన్‌చేసి బూతు పురాణం అందుకున్నారంట. మమ్మల్ని కాదని నువ్వు ఎలా పనిచేస్తావో చూస్తాం... అంటూ ఛాలెంజ్ చేశారని మురళీకృష్ణారెడ్డి ఆరోపిస్తున్నారు. అంతే కాకుండా అసలు నెల్లూరులో ఎలా అడుగుపెడతావో చూస్తాం... ఎలా పనిచేస్తావో చెయ్... అంటూ తీవ్రస్వరంతో దుర్భాషలాడారని మురళీకృష్ణారెడ్డి చెప్తున్నారు. నోటితో చెప్పలేని అలబర భాషతో మాట్లాడారని ఆయన ఆవేదనతో అంటున్నారు. అంతేకాదు లేండి ఇంకా చాలానే అన్నారంట. జిల్లాలో రెడ్లను పక్కనపెట్టి జగన్‌మోహన్‌రెడ్డి తమకు పట్టం కట్టి పెత్తనం ఇచ్చారని, అదీ తమ సత్తా అని, తమతో పెట్టుకుంటే అవతలి వాడెంతటివాడైనా సరే... వదిలే ప్రసక్తే లేదని అన్నారని ఆయన ఆందోళనగా చెప్తున్నారు.

## పోలీసుకి ఫిర్యాదు - కోర్టులో కేసు నమోదు...



మురళీకృష్ణారెడ్డి ఫిర్యాదు



హైదరాబాదులో నమోదైన ఎఫ్ఐఆర్

మంత్రి, ఆయన బాబాయ్ మాటలకు మనస్తాపం చెందిన మురళీకృష్ణారెడ్డి హైదరాబాదులోని రాజేంద్రనగర్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తనకి కాల్స్ వచ్చిన రెండు నెంబర్ల వివరాలను, కాల్ రికార్డులను వారికి అందించారు. సదరు రెండు నెంబర్లలో ఒకటి రూప్‌కుమార్‌యాదవ్‌ది కాగా, రెండవది మంత్రి అనిల్‌కుమార్‌యాదవ్‌దిగా తెలంగాణ పోలీసులు గుర్తించి ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ముందుగా రూప్‌ని హైదరాబాదు వచ్చి కలవవలసిందిగా కాల్ చేశారంట. ఆయనకు రాను వీలుకాకుంటే తామే వచ్చి రాజమర్యాదలతో తీసుకెళ్తామని చెప్పారంట. ఈ వ్యవహారం ఆ నోటా ఈ నోటా పాకి ముఖ్యమంత్రి కార్యాలయానికి కూడా చేరిందంటున్నారు. మరోవైపు బీజేపీ, తెలుగుదేశం నాయకులు కూడా ఈ విషయంపై ఆగమాగం చేశారు. ఇప్పుడు తాజాగా కథ పోలీస్‌స్టేషన్ నుండి కోర్టుకి చేరిందని తెలుస్తోంది. కోర్టుకి సమర్పించిన కంప్లైంట్‌లో పనిలో పనిగా మంత్రి పేరు కూడా జోడించారని హైదరాబాదు సమాచారం. ఏదిఏమైనా ఇది చిన్న విషయం కాదు, కూర్చొని మాట్లాడుకుంటే పోయేదానికి బెదిరించడాలు, అంతు చూడడాలు దాకా వెళ్ళారు. మురళీకృష్ణారెడ్డి ఈ విషయాన్ని అంత తేలిగ్గా వదిలేలా లేరు. తనతో పాటు తన కుటుంబసభ్యులను కూడా అసహ్యంగా మాట్లాడిన బాబాయ్, అబ్బాయిలకు బుద్ధి చెప్పే తీరాలని గట్టిగా నిర్ణయించుకుని పావులు కదుపుతున్నట్లు భోగట్టా!

## టెండర్ రద్దుకి సన్నాహాలు...

ఒకవైపు మురళీకృష్ణారెడ్డితో రాజీ ప్రయత్నాలు జరుపుతూనే మరోవైపు టెండర్‌ను రద్దు చేయించడానికి మంత్రి ఆసక్తి చూపుతున్నారని అంటున్నారు. తనకు ఇష్టం లేకుండా ఇక ఆ పనిని ఆ కాంట్రాక్టర్ చేయడానికి లేదని పట్టుపడుతున్నారని కూడా వార్త. ఆ దిశగా ఇప్పటికే అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారని, కుంటి సాకులు చూపించి నిబంధనలకు విరుద్ధంగా టెండర్‌ను రద్దు చేయడానికి దారులు వెతుకుతున్నారని అంటున్నారు.

## విభేదాల డ్రామా...

విషయం సిఎంఓ దాకా చేరడంతో ఇప్పుడు తనకు, తన బాబాయికీ అస్సలు పడడంలేదని, ఆయనను దూరంగా పెట్టారని సామాజిక మాధ్యమాల ద్వారా జోరుగా ప్రచారం మొదలుపెట్టారు. పరిస్థితులు చేయి దాటిపోతున్నాయన్న అనుమానం రావడంతో కొత్త డ్రామాకి తెరలేపారని వైసీపీ శ్రేణులే చెవులు కొరుక్కోవడం విశేషం.

## ఇది నెల్లూరా లేక బీహారా...?

నెల్లూరులో పార్టీకి పెద్దదిక్కే లేకుండా పోయిందని సొంత పార్టీ శ్రేణులే ఆందోళన చెందుతున్నారు. ఒకప్పుడు రాష్ట్రానికి ఒక్కరే సీఎం ఉండేవారని, ఇప్పుడు జిల్లాలో నియోజకవర్గాల వారీగా సీఎంలు తయారవుతున్నారని వాపోతున్నారు. జిల్లాలో పెద్దరికం అన్నది కరువైపోవడంతో నేతల అరాచకాలు ఎక్కువైపోతున్నాయని బాధపడుతున్నారు. క్షేత్రస్థాయిలో జరుగుతున్న అక్రమాలు ముఖ్యమంత్రి వరకూ చేరుతున్నాయా లేదా అన్న అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రశాంతమైన నెల్లూరులో బీహార్ తరహా బెదిరింపులు, దుర్మార్గాలు జరగడం బాధాకరంగా ఉందని వైసీపీ ద్వితీయ శ్రేణి నాయకులు విచారం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పార్టీ పెద్దలు జోక్యం చేసుకుని భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా చూడాలని కోరుతున్నారు. పరపతి, పలుకుబడి ఉన్న మురళీకృష్ణారెడ్డి లాంటి వాళ్ళనే ఇలా బెదిరిస్తే... ఇక సామాన్యుల పరిస్థితి ఏమిటో? ప్రత్యేకంగా చెప్పనవసరం లేదని కూడా అంటున్నారు. మొత్తానికి ఈ టెండర్ వివాదం ఇటు జిల్లాలోనూ, అటు రాష్ట్రంలోనూ పెనుదుమారాన్నే లేపింది. ఇవతలవైపు సాక్షాత్తూ మంత్రి కావడం... అటు వైపున ముఖ్యమంత్రి సమీప బంధువుకి వియ్యంకుడు కావడంతో... ఇద్దరూ 'తగ్గేదే..లే' అన్న తీరులో వ్యవహరిస్తుండడంతో విషయం ఎక్కడిదాకా దారి తీస్తుందోనని వైసీపీ వర్గాలే చర్చించుకోవడం విశేషం. చిన్న వయస్సులో రాజకీయంగా ఉన్నతస్థానానికి ఎదిగిన తమ నాయకుడు... ఎదిగేకొద్దీ ఒదగాలన్న సూత్రంతో మంచి రాజకీయ భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకుంటాడనుకున్నామని, ఇలా అనవసరమైన విషయాలతో వివాదాస్పదం కావడం విచారకరమని మంత్రి వర్గీయులు బాధపడుతుండడం కొసమెరుపు.



అమెరికాలోని లాస్‌వేగస్‌లో జరిగిన 'నాటా' కార్యవర్గ సమావేశం సందర్భంగా 'నాటా' స్ఫూర్తిప్రదాత డాక్టర్ ప్రేమ్‌రెడ్డిని 'లాయర్' పత్రిక పక్షాన సత్కరించి, 'లాయర్' 40వ వార్షికోత్సవం సందర్భంగా ప్రచురించిన 'విజయపథంలో నెల్లూరీయులు' కాఫీటేబుల్ పుస్తకాన్ని అందజేస్తున్న 'నాటా' కొత్త అధ్యక్షుడు కోర్సపాటి శ్రీధర్‌రెడ్డి. 'విజయపథంలో నెల్లూరీయులు' పుస్తకంలో ప్రచురించబడిన తన వ్యాసాన్ని చూసుకుని మురిసిపోతున్న డాక్టర్ ప్రేమ్‌రెడ్డి.


ప్రతిభకు పట్టాభిషేకం



నార్త్ అమెరికా తెలుగు అసోసియేషన్(NATA)
నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన
ప్రతిభాశాలి, ప్రజ్ఞాశాలి, ధైర్యశాలి, ధీశాలి
డాక్టర్ కోర్సపాటి శ్రీధర్‌రెడ్డి గారికి
మా ఆనందాభినందనలు.

SMD HOMES
Value beyond Bricks
Bangalore | Tirupathi | Nellore

## 'ప్రభా'తం

# 'ఉచితాలు'.. అనుచితమే!

**ఎన్నికలొచ్చినప్పుడల్లా కొన్ని పార్టీలు, కొందరు నాయకులు ఇష్టం వచ్చిన రీతిగా వాగ్దానాలు చేసేయడం, ఉచితాల పేరుతో తాయిలాలు ఇవ్వజూపడం, ఓటర్లను ప్రలోభపెట్టడం వంటివన్నీ సర్వసాధారణ దృశ్యాలుగా మారిపోతున్న నేటి కాలంలో, అలాంటి ఉచితహామీలను నివారించడానికి సుప్రీంకోర్టు సంకల్పించడం హర్షదాయకం. 'ఉచిత' హామీలు అనుచితమని సుప్రీం కోర్టు ధర్మాసనం చురకంటించడమే కాక వాటికి అడ్డుకట్ట వేసేందుకు తగు నిర్ణయాలు తీసుకోవడం అందరికీ ఆనందం కలిగిస్తున్న విషయం. అదేవిధంగా సమాజంలో ప్రతి పౌరుడు కూడా బాధ్యతాయుతంగా ఉంటూ ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించు కోవాలి. తద్వారా సమాజంలో ప్రతి పౌరుడూ అందరికీ మార్గదర్శకం కావాలి.**

మన దేశంలో రకరకాల విచిత్రమైన వ్యవహారాలు జరిగిపోతుంటాయి. అందులో కొందరు నాయకుల తీరు మరింత విచిత్రంగా ఉంటుంది. ఎన్నికలొచ్చినప్పుడు మాత్రమే అనేకమంది నాయకులు ప్రజల్లోకొచ్చి ప్రత్యక్షంగా కనిపిస్తుంటారు. ఓట్లు వేయండంటూ ఇళ్ళకు వచ్చి చేతులు జోడించి రకరకాల విధాలుగా ఓటర్లను అభ్యర్థిస్తుంటారు. ఇదంతా మామూలే. ఎన్నికలయ్యాక చాలా మంది నాయకులు జనానికి కనిపించనంత బిజీ అయిపోతారు. ఇది కూడా మామూలే. అయితే వచ్చిన చిక్కల్లా ఏమిటంటే ఎన్నికల్లో ఓటర్లను ఎలాగైనా ఆకట్టుకునేందుకు రకరకాల విపరీత పద్ధతుల్ని కూడా ఆచరణలోకి పెడుతుండడం. కొందరు డబ్బులిస్తామంటారు.. చీరలిస్తామంటారు.. ముక్కుపుడకలు ఇస్తామంటారు. ఓట్లు వేయించుకోవాలనే తపనతో ఇలా లేనిపోని హామీలన్నీ వరుసపెట్టి గుప్పిస్తుంటారు. మరికొందరైతే డబ్బు, మద్యం వగైరాలను కూడా ఎన్నికల్లో కుమ్మరించేస్తుంటారు. డబ్బును మంచినీళ్ళలా ఖర్చుపెట్టేసి ఎన్నికల నిబంధనలన్నిటినీ తోసిపుచ్చి చిత్తం వచ్చినట్లు వ్యవహరిస్తుంటారు. ఎన్నికల్లో తామే గెలవాలనే పట్టుదలతో ఎలాగైనా సరే ఓట్లు రాబట్టాలనే ధ్యేయంతో ముందు వెనుక చూడకుండా హామీలు ఇచ్చేస్తుంటారు తప్ప నైతిక విలువలకు విలువనిచ్చే మహానుభావులు తక్కువైపోతున్న కాలమిది. ప్రజలు కూడా అలాంటి నాయకులను ఏళ్ళ తరబడిగా చూసి చూసి విసిగి పోయి.. ఇవన్నీ విచిత్రమైనవేమీ కాదని, ఎన్నికలప్పుడు కనిపించే సర్వసాధారణ దృశ్యాలేనని సరిపెట్టుకుంటున్నారు. ఇలాంటివన్నీ అందరికీ తెలిసిన బహిరంగ రహస్యాలే. కానీ ఎవరూ పెద్దగా పట్టించుకోకపోవడం కూడా మామూలే. ఈ నేపథ్యంలో ఇటీవలి కాలంలో మరో విచిత్రమైన సంస్కృతి వచ్చిపడింది. దానిపేరే 'ఉచితం'!..ఎన్నికల్లో గెలవడానికి ఇదో పెద్ద తారక మంత్రంగా ఉంటోంది కొందరు నాయకులకి. అదే బాధాకరం!.. దేశంలోని అనేక రాష్ట్రాల్లో ఇటీవలికాలంలో ఈ 'ఉచిత సంస్కృతి' విచ్చలవిడిగా పెరిగిపోతోంది. అసలు ఓటర్లను ప్రలోభపెట్టేందుకు రాజకీయపార్టీలు ఉచితాల పేరుతో హామీలు గుప్పించడం సమంజసం కాదని, ఇదెంతో ఆందోళనకరమైన విషయమని తాజాగా సుప్రీంకోర్టు కూడా స్పష్టం చేయడం రాజకీయపార్టీలకు వేసిన చురక వంటిదేననవచ్చు. ఈ ఉచిత వ్యవహారాలపై ఇటీవల దాఖలైన ఒక ప్రజాప్రయోజనాల వ్యాజ్యంలో సుప్రీంకోర్టు తనదైన విస్పష్టమైన శైలిలో స్పందించడంతో పార్టీలు అయోమయంలో పడుతున్నాయి. ఇప్పుడు ఇక ఎలాంటి మాయోపాయాలను వెతుక్కోవాలా అనే ఆలోచనలోనూ పడ్డాయి. జనం మాత్రం సుప్రీం నిర్ణయానికి బాగా సంతోషిస్తున్నారు. ప్రజలను ప్రలోభపెడుతూ ఇచ్చే 'ఉచితాలు' ఒకవిధంగా ఓటరుకు లంచం ఇవ్వడమే కదా అని కూడా పిటిషనర్ వాపోయారు కూడా. ఇవన్నీ విచారించిన సుప్రీం ధర్మాసనం అనుచితమనిపించే ఈ ఉచిత వ్యవహారాలకు, ఉచిత హామీలు వగైరాలన్నిటికీ అడ్డుకట్ట వేసేందుకు సంకల్పించడం ఎంతో హర్షదాయకం. ఉచిత హామీలు ఎంతైన ఆందోళనకరమని, వాళ్ళిచ్చే వాగ్దానాల బడ్జెట్ అసలు బడ్జెట్‌ను కూడా మించిపోతున్నదని, ఎన్నికలకు ముందు ప్రజల ధనంతో నిర్హేతుకమైన ఉచిత పథకాలను అమలుచేస్తున్న రాజకీయపార్టీలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ వచ్చిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు ధర్మాసనం విచారణ జరిపి, నిస్సందేహంగా ఇది తీవ్రమైన సమస్యేనని భావించడమే కాక, దీనిని నియంత్రించేందుకు మార్గాలను అన్వేషించాలని పేర్కొని ప్రజల అభినందనలు అందుకుంటోంది. త్వరలో దేశంలోని అయిదు రాష్ట్రాల్లో జరగనున్న ఎన్నికల నేపథ్యంలో ఉచిత వాగ్దానాలతో రాజకీయపార్టీలు ఓటర్లను ప్రలోభపెడుతున్నాయని పిటిషనర్ ఆరోపించిన సందర్భంగా సుప్రీంకోర్టు చీఫ్‌జస్టిస్ ఎన్‌వి రమణ 'ఉచితాల బడ్జెట్ సాధారణ బడ్జెట్‌ను మించిపోతోంది. చట్టబద్ధంగా ఈ వ్యవహారాన్ని ఎలా నియంత్రించాలి?.. ఇది చాలా తీవ్రమైన సమస్య' అని వ్యాఖ్యానించడం, ఈ పిటిషన్‌పై స్పందించాలంటూ కేంద్రప్రభుత్వానికి, ఎన్నికల సంఘానికి సుప్రీం ధర్మాసనం నోటీసులు కూడా జారీచేయడం సంచలనం కలిగించే విషయం. ఎన్నికల్లో పోటీపడి హామీలిస్తున్న రాజకీయ పార్టీలను ఈ వ్యాజ్యంలో కక్షిదారులుగా చేర్చాల్సిందని ధర్మాసనం అభిప్రాయపడింది కూడా. త్వరలో ఎన్నికలు జరగనున్న ఒక రాష్ట్రంలో ఒక పార్టీ 18 ఏళ్ళ వయసు దాటిన ప్రతి మహిళకు నెలకు వెయ్యిరూపాయల వంతున ఇస్తామని చెప్పడం, మరోపార్టీ రెండువేలిస్తామనడం, ఇంకా గృహిణులకు గ్యాస్ సిలిండర్లు, విద్యార్థులకు స్మార్ట్‌ఫోన్‌లు ఇస్తామనడం వంటివన్నీ జరుగుతున్నాయంటూ పిటిషనర్ ఆరోపించిన నేపథ్యంలో సుప్రీం ధర్మాసనం ఆ విషయాల పట్ల సీరియస్ అయింది. ఇలాంటి అనుచితాలను కట్టడిచేసి సమాజంలో బాధ్యతాయుతమైన వాతావరణాన్ని పెంపొందించేందుకు తగు చర్యలు తీసుకునేందుకు కూడా సిద్ధమైంది. దీంతోపాటు ప్రజలు కూడా బాగా విజ్ఞతతో ఆలోచించాలి. మన ఓటును మనం ఎట్టిపరిస్థితుల్లోనూ ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా వినియోగించుకోవాలి. నాయకుల 'ఉచితాలకు' మనం దాసోహమైతే మనకే కాదు, తద్వారా సమాజానికి చేటు తప్పదు. మన ఓటును మన జీవితాలకు మేలిమలుపుగా భావించాలే తప్ప ఓటును అమ్ముకోకూడదు. ఓటు ద్వారా ఉత్తమమైన నాయకులను ఎన్నుకుని భవిష్యత్తును బంగారుబాటగా చేసుకోవాలి. అందుకు తగ్గ అవగాహనను ప్రజల్లో పెంపొందించేందుకు స్వచ్ఛందసంస్థలు, సమాజ శ్రేయోభిలాషులు ముందుకు రావాలి. మన ఓటు.. మన కర్తవ్యం!.. మన ఓటు.. మన బాధ్యత!.. మన ఓటు.. మన వజ్రాయుధం!.. అనే భావనతో ఉంటూ ఓటు హక్కుకు ఉన్న విలువను తెలుసుకుని దానిని సద్వినియోగం చేసుకోవాలి. తద్వారా సమాజంలో ప్రతి పౌరుడూ అందరికీ మార్గదర్శకం కావాలి.

---

## వెన్నెలకంటి రాఘవయ్య విగ్రహాన్ని నెలకొల్పాలి

### - మేయర్‌కు యానాదుల సంక్షేమ సంఘం నాయకుల వినతి



ప్రముఖ స్వాతంత్ర్యసమర యోధుడు, ఆదిమజాతుల సముద్ధరణకు జీవితాంతం కృషిచేసిన సంఘ సంస్కర్త వెన్నెలకంటి రాఘవయ్య సేవలు ఎంతో స్ఫూర్తిదాయకమని, భావితరాల వారికి ఆ మహనీయుని గురించి తెలిసేవిధంగా నగరంలోని కొండాయపాళెం గేటు, లేదా భక్తవత్సలనగర్ ప్రాంతంలో వెన్నెలకంటి విగ్రహాన్ని ఏర్పాటుచేయాలని యానాదుల సంక్షేమసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెసి పెంచలయ్య కోరారు. ఈనెల 24న నగరంలోని కార్పొరేషన్ కార్యాలయంలో మేయర్ పొట్లూరి స్రవంతిని కలిసి ఆయన ఈ విషయమై వినతిపత్రం అందజేశారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు శేఖర్, ఉష, శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

### బీమా కావాలంటే..

## 'ఈ-క్రాప్'లో నమోదు చేసుకోవాలి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏఎస్ఓ

వైఎస్సార్ ఉచిత బీమా పథకం వర్తించాలంటే ప్రతి రైతు తప్పని సరిగా తమ పంటల వివరాలను ఈ-క్రాప్ లో నమోదు చేసుకోవాలని ఏఎస్ఓ రామ్‌ప్రసాద్ సూచించారు. ఈనెల 24న ఆయన ఇందుకూరుపేటలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో గ్రామ వ్యవసాయ సహాయకులకు ఏర్పాటుచేసిన శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతూ రైతులకు బీమా చేయించేందుకు ప్రతిఒక్కరూ శ్రద్ధ తీసుకోవాలన్నారు. పంటకోత విషయాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వారికి వివరించారు. వ్యవసాయ అధికారి రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



### రంగనాథస్వామికి

## పెరిగిన హుండీ రాబడి

ప్రముఖ పుణ్యక్షేత్రమైన నెల్లూరు రంగనాయకులపేటలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ తల్పగిరి రంగనాథస్వామి దేవాలయానికి ఇటీవల హుండీ రాబడి బాగా పెరిగింది. గత ఏడాది ఇదే రోజుల్లో వచ్చిన ఆదాయం కంటే ఈసారి భక్తులు సమర్పించిన కానుకలు లక్షా 26వేల రూపాయలకు పైగానే పెరగడం విశేషం. ఈనెల 24న హుండీలను లెక్కించగా గత సంవత్సరం అక్టోబరు 8 నుంచి ఈ ఏడాది జనవరి 24వ తేదీ వరకు 13,10,376 రూపాయలు వచ్చాయని, జనవరి 1 నుంచి వైకుంఠ ఏకాదశి, అధ్యయనోత్సవాలను పురస్కరించుకుని తాత్కాలికంగా ఏర్పాటుచేసిన హుండీల ద్వారా 3,67,161 రూపాయలు వచ్చాయని, దీంతో కలిపి మొత్తం 16,71,537 రూపాయల రాబడి వచ్చిందని ఆలయ వర్గాలు పేర్కొన్నాయి. ఆలయ ఛైర్మన్ ఇలపాక శివకుమార్ ఆచారి, ఇ.ఓ డి. వెంకటేశ్వర్లు, ధర్మకర్తల మండలి సభ్యులు శివగామి, నరసింహాచార్యులు, దేవాదాయశాఖ ఇన్స్‌పెక్టర్ చైతన్య పర్యవేక్షణలో ఈ లెక్కింపు జరిగింది.

## విద్యుత్ సమస్యలు తీరేదెప్పుడో?

ఈ-మెయిల్ ప్రజావాణి lawyerpatrika@gmail.com +91 98663 14741

జిల్లాలో అనేకమంది పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఇటీవలి కాలంలో వస్తున్న కరెంటు బిల్లులు షాక్ కొడుతున్నాయి. ఎవరికి ఎంత బిల్లు వస్తే అంతా కట్టాల్సిందే తప్ప మరో మార్గాంతరం ఉండడం లేదు. బిల్లులు ఎందుకు ఎక్కువ వచ్చాయని అడిగితే సమాధానం చెప్పేవారు కూడా ఉండడం లేదు. విద్యుత్ అత్యవసరం కనుక అప్పటికప్పుడు కట్టక తప్పడం లేదు. బిల్లులు భారీగానే వస్తుండడం ఒక బాధైతే, విద్యుత్ సమస్యలతో మరో బాధ. కరెంటు వైర్లు అనేకచోట్ల అందరికీ చేతికి అందేంత ఎత్తులో ఉండడం, విద్యుత్ స్తంభాలు వాలిపోయి ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆయా ప్రాంతాల్లో ప్రజలు గుప్పెట్లో ప్రాణాలు పెట్టుకుని బతుకుతున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఏళ్ళతరబడిగా విద్యుత్ స్తంభాలు మార్చడం లేదు. అవి మరమ్మతులకు గురైనా, శిథిలమైపోయినా అలాగే వదిలేస్తున్నారు తప్ప ఎవరూ పట్టించుకోవడం లేదు. ఈ విద్యుత్ సమస్యలు ఎప్పటికి తీరుతాయో అర్థం కావడం లేదు. ఇకనైనా జిల్లా ఉన్నతాధికారులు విద్యుత్ స్తంభాలు, విద్యుత్ వైర్ల స్థితిగతులను పరిశీలిస్తూ ఎలాంటి ప్రమాదాలు జరగకుండా చూడాలని విజ్ఞప్తి.

జెవిఎస్ సుబ్బరామశర్మ, **ఆత్మకూరు.**

## ప్లాస్టిక్ గుట్టలుగా పేరుకుంటూనే ఉంది

నెల్లూరు నగరంలో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. ఏ వీధి చూసినా ప్లాస్టిక్ కవర్ల గుట్టలతో నిండిపోతున్నాయి. వాటిని తిని పశువులు, మూగజీవాలు అనారోగ్యాలకు గురవుతున్నాయి. మరోపక్క వానలతో ఈ వ్యర్థాలు కలిసిపోయి దుర్గంధం వ్యాపిస్తోంది. నగరంలో పారిశుద్ధ్యం పనివారు ఎప్పటికప్పుడు పరిశుభ్రం చేస్తూనే ఉన్నా నిత్యం ప్లాస్టిక్ వ్యర్థాలు టన్నులకొద్దీ వచ్చిపడుతూనే ఉన్నాయి. నగరాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడం ఒక్క అధికారులదే కాదు.. అందరి బాధ్యత కూడా. ప్లాస్టిక్ వ్యర్థాలను, చెత్తాచెదారాన్ని నిర్దిష్ట పద్ధతుల్లో పారిశుద్ధ్య పనివారికి అందించాలని అధికారులు పదేపదే చెప్తున్నా ఆచరించేవారు తక్కువే. పర్యావరణానికి, మానవ మనుగడకు ముప్పు కలిగించే నిషేధిత ప్లాస్టిక్‌ను వాడకుండా ప్రతిఒక్కరూ ఇకనైనా జాగ్రత్త వహించాలి. విజ్ఞులైన నెల్లూరు ప్రజలు తలచుకుంటే వీటిని నివారించుకోవడం పెద్ద కష్టమేమీ కాదు. నెల్లూరు రోడ్లు వ్యర్థాలతో, చెత్తాచెదారాలు.. మురుగుగుబ్బలతో ఉండడం వల్ల నగర ప్రజలకే అనారోగ్యం కనుక వాటిని నియంత్రించేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేస్తారని ఆశిద్దాం!...

ఆర్. కృష్ణయ్య, **నెల్లూరు.**

# విశిష్ట సేవలకు.. విశేష గుర్తింపు

## సిఐడి డిఎస్పీ రాంబాబుకు ఇండియన్ పోలీస్ మెడల్



క్రమశిక్షణకు, నిజాయితీకి నిర్భీతికి మారు పేరుగా ఉంటూ, విధి నిర్వహణలో ముక్కు సూటిగా వ్యవహరిస్తూ ఎందరో నేరస్తులు, అసాంఘికశక్తుల ఆటకట్టించిన నెల్లూరు సిఐడి డిఎస్పీ వాకా శ్రీరాంబాబుకు కేంద్రప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఇండియన్ పోలీస్ మెడల్‌ను ప్రకటించడం జిల్లా పోలీసుశాఖకే గర్వకారణం. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని రాంబాబుకు ఈ సమున్నతమైన పురస్కారాన్ని ప్రకటించింది. నేరస్తుల పాలిట సింహస్వప్నంగా ఉండే రాంబాబు ఎంతో స్నేహశీలి కూడా. మంచి వ్యక్తిత్వం, కష్టపడి పనిచేసే తత్వం, భేషజం లేకుండా అందరితో కలుపుగోలుగా ఉండడం ఆయన మనస్తత్వం. రాంబాబుకు కేంద్రప్రభుత్వం నుంచి ఇండియన్ పోలీస్ మెడల్ రావడం ఆయన విశిష్టమైన పనితీరుకు నిదర్శనం.

### చిన్నస్థాయి నుంచి అంచలంచెలుగా ఎదుగుతూ :

రాంబాబు స్వస్థలం గుంటూరుజిల్లాలోని చెరుకుపల్లి మండలంలో ఉన్న వాకావారి పల్లి అనే కుగ్రామం. 1989లో ఆయన ఎస్ఐగా పోలీసుశాఖలో చేరారు. నెల్లూరు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో కూడా ఎస్ఐగా పనిచేశారు. వృత్తిపట్ల ఎనలేని గౌరవంతో, నిబద్ధతతో పనిచేస్తూ చిన్నస్థాయి నుంచి అంచలంచెలుగా ఎదిగారు. పనిచేసిన ప్రతిచోటా ఎక్కడా ఎలాంటి అపఖ్యాతి లేకుండా శెభాష్ రాంబాబు అనిపించుకున్నారు. అనేక క్లిష్టమైన కేసులను ఛేదించారు. ఎంతోమంది కరడుగట్టిన నేరస్తులను సైతం పట్టుకున్నారు. 2004లో సిఐగా, 2013లో డిఎస్పీగా ఉద్యోగోన్నతి పొందారు. నెల్లూరుజిల్లాలో నెల్లూరు రూరల్‌లోను, గూడూరులోను, స్పెషల్‌బ్రాంచ్, సిఐడి శాఖల్లోనూ పనిచేశారు. ప్రకాశం జిల్లాలో అద్దంకి, దర్శి, స్పెషల్‌బ్రాంచ్‌లలో పనిచేసి తిరుపతిలో సిఐడి డిఎస్పీగా ఉద్యోగబాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుతం నెల్లూరు సిఐడి డిఎస్పీగా పనిచేస్తున్నారు. తానెక్కడ పనిచేసినా ఉత్తమమైన పనితీరుతో తనదైన ముద్రవేసుకుంటూనే ఉన్నారు.

### ఎన్నో అవార్డులు.. రివార్డులు :

తన కెరీర్‌లో దాదాపు 200కు పైగానే విశిష్టమైన అవార్డులు, రివార్డులు అందుకున్నారంటే రాంబాబు విధినిర్వహణలో ఎంత అంకితభావంతో పని చేసేవారో అర్థమవుతుంది. 2003లో రాష్ట్ర ప్రభుత్వం నుంచి సేవాపతకం, 2011లో ఉత్తమ సేవా పతకం, 2018లో కేంద్రప్రభుత్వం నుంచి ఉత్కృష్ట సేవా పతకం వంటి ఎన్నో విశిష్టమైన పతకాలను ఆయన అందుకున్నారు. వీటితో పాటు ఇప్పుడు ఇండియన్ పోలీస్ మెడల్ రావడంతో జిల్లా పోలీసుశాఖ ఎంతో ఆనందిస్తోంది. జిల్లా ఎస్పీ సిహెచ్ విజయారావు, సిఐడి డిఎస్పీ రాజేంద్రకుమార్‌తో పాటు పలువురు డిఎస్పీలు, పోలీసు అధికారులు రాంబాబును అభినందించారు. వచ్చే ఆగష్టు 15న స్వాతంత్ర్యదినోత్సవం రోజున రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ఎంతో అరుదైన ఇండియన్ పోలీస్‌మెడల్‌ను అందుకోనున్న రాంబాబుకు 'లాయర్' శుభాకాంక్షలు!

బుచ్చి అభివృద్ధికి..

# 250 కోట్లతో ప్రతిపాదనలు

## ఎమ్మెల్యే ప్రసన్న



బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ అభివృద్ధికి సుమారు 250 కోట్ల రూపాయల ప్రతిపాదనలను రాష్ట్ర మునిసిపల్ శాఖ మంత్రి బొత్స సత్యనారాయణకు కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి అందజేసి బుచ్చి అభివృద్ధి పట్ల తన కున్న చిత్తశుద్ధిని నిరూపించుకున్నారు. ఈనెల 25న ఆయన విజయవాడలోని మంత్రి నివాసానికి వెళ్ళి ఆ ప్రతిపాదనలను మంత్రికి సమర్పించారు. సంగం బ్యారేజీ నుంచి పైప్‌లైను ఏర్పాటుచేసి ప్రతి ఇంటికి సురక్షితమైన మంచినీరు అందించేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే ప్రసన్న ఈ సందర్భంగా చెప్పారు. బుచ్చి పంచాయతీలో అవసరమైన చోట్ల సిమెంట్‌రోడ్లు, సైడు కాలువలు ఏర్పాటుచేస్తామని, త్వరలోనే నిధులు కూడా వస్తాయని, వీటితో బుచ్చి రెడ్డిపాళెం రూపురేఖలే మార్చివేస్తామని, అభివృద్ధి పథంలో బుచ్చిరెడ్డిపాళెం ముందంజలో ఉండేలా చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట డిసిఎంఎస్ ఛైర్మెన్ వీరి చలపతి రావు, వైకాపా నాయకుడు సుబ్రహ్మణ్యంనాయుడు తదితరులున్నారు.

రైతన్నల సంక్షేమం..

# ప్రభుత్వ ధ్యేయం



రామ్‌కుమార్‌రెడ్డిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే సంజీవయ్య

రాష్ట్ర వ్యాప్తంగా రైతన్నల సంక్షేమం కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశ పెట్టి అమలుచేస్తోందని, అన్నదాతలకు అండగా నిలుస్తూ ప్రభుత్వం వారి అభ్యున్నతికి అహరహం కృషిచేస్తోందని రాష్ట్ర కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బోర్డు ఛైర్మెన్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఈనెల 25న ఆయన వాకాడులో పలు మండలాల రైతులతో కలసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాకాడులోని స్వర్ణముఖి బ్యారేజి గేట్లు 2.5 అడుగుల ఎత్తు పెంచాలని, శాశ్వత హక్కుగా ప్రతిఏడాది 3 టిఎంసిల గంగ జలాలు విడుదల చేయాలని ముఖ్యమంత్రిని కోరామని, ఆ ప్రతిపాదనలు కూడా పంపామని రామ్‌కుమార్‌రెడ్డి రైతులకు వివరించారు. ముఖ్యమంత్రి అందుకు సానుకూలంగా స్పందించారని, త్వరలోనే నిధులు మంజూరై పనులు ప్రారంభమవుతాయని, ఆ పనులు పూర్తయితే ఈ ప్రాంతంలోని ఎంతోమంది రైతులకు ఉపయోగంగా ఉంటుందని అన్నారు. ఈ సందర్భంగా సూళ్ళూరుపేట ఎమ్మెల్యే, తిరుమల తిరుపతి దేవస్థానాల పాలకమండలి సభ్యుడు కిలివేటి సంజీవయ్య రామ్‌కుమార్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకుని శాలువాతో సత్కరించారు.

ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు దామోదర్‌రెడ్డి, హిమకుమార్ రెడ్డి, నాగూర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, చిట్టిబాబు, భార్గవరామ్, సుధాకర్‌రెడ్డి, తంబిరెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి, జలదంకి వెంకటకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జొన్నవాడ కామాక్షమ్మ ఆలయానికి..

# కొత్త పాలకవర్గం

## ఛైర్మెన్‌గా మరోసారి.. పుట్టా సుబ్రహ్మణ్యం నాయుడు



జొన్నవాడ శ్రీ మల్లికార్జున సమేత కామాక్షి తాయి అమ్మవారి ఆలయానికి కొత్త పాలక మండలి ఏర్పడింది. ఈనెల 25న దేవాదాయ శాఖ కమిషనర్ ఆ మేరకు ఆదేశాలు జారీచేశారు. కొత్త ఛైర్మెన్‌గా రెండవసారి పుట్టా సుబ్రహ్మణ్యం నాయుడు నియమితులు కావడం విశేషం. 2017–18లో కూడా ఆయన ఛైర్మెన్‌గా వ్యవహరించారు. కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న ఆశీస్సులతో ఆయనకు ఈ పదవి లభించినట్లు సమాచారం. ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులుగా తిరువాయిపాటి నందకుమార్, తిరుమూరు సుప్రజ, బట్టేపాటి విజయమ్మ, గుమ్మా రఘురామయ్య, ఆములూరు విమల, గుంటూరు కామేశ్వరి, కాగొల్లు పద్మ, ముంగర శివకుమార్, అర్చకవర్గాల నుంచి శ్రీశైలం శశిశేఖర్ నియమితులయ్యారు. కొత్త పాలకమండలి ప్రమాణస్వీకారం ఫిబ్రవరి 3న జరగవచ్చని భావిస్తున్నారు.

# విద్యుత్ ఛార్జీలు పెంచవద్దు

విద్యుత్ ఛార్జీలను పెంచి ప్రజలపై అదనపు భారం మోపవద్దని సిపిఎం నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఈనెల 25న ఆత్మకూరులోని విద్యుత్‌శాఖ ఇంజనీర్‌ను కలసి ఆ మేరకు వారు వినతిపత్రం అందజేశారు. ఆత్మకూరులో 30 ఏళ్ళ క్రితం ఏర్పాటుచేసిన విద్యుత్‌స్తంభాలు, వైర్లను ఇప్పటికీ మార్చలేదని, కొన్నిచోట్ల విద్యుత్ వైర్లు చేతికందే ఎత్తులో ఉన్నాయని, ఇకనైనా విద్యుత్ అధికారులు ఈ సమస్యలను పరిశీలించి వెంటనే వాటిని బాగుచేయాలని కోరారు.


అరుదైన వైద్యుడు - అద్భుతాలకు ఆద్యుడు



జననం 28.10.1948

నిర్యాణం 22.01.2022

డాక్టర్ జె.పి.రెడ్డి గారి

ఆత్మశాంతికై ప్రార్థిస్తూ...



తుంగా కుటుంబం

# ఓటేయడం.. ప్రతిఒక్కరి బాధ్యత

**జేసీ హరేందిరప్రసాద్**

ఓటేయడం అనేది ప్రతిఒక్కరికీ ఒక బృహత్తరమైన బాధ్యత అని, 18 ఏళ్ళు నిండినవారంతా తప్పనిసరిగా తమ ఓటును నమోదు చేసుకుని ఓటుహక్కు వినియోగించుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ హరేందిర ప్రసాద్ చెప్పారు. ఓటేయకుండా ఇళ్ళల్లో కూర్చుని లేనిపోని విమర్శలు చేయడం మంచిపద్ధతి కాదన్నారు. ఓటువేయని వారికి విమర్శించే నైతిక హక్కు లేదన్నారు. ఈనెల 25న నెల్లూరులోని కస్తూర్బా కళాక్షేత్రంలో జరిగిన 12వ జాతీయ ఓటర్ల దినోత్సవంలో జేసీ పాల్గొని ఓటుహక్కు విశిష్టతను అందరికీ వివరించారు. డబ్బుకు, మద్యం వంటి ప్రలోభాలకు లోనుకాకుండా ప్రతిఒక్కరూ బాధ్యతగా ఉంటూ తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని ఈ కార్యక్రమంలో పాల్గొన్న విక్రమసింహపురి యూనివర్శిటీ వైస్ చాన్సలర్ సుందరవల్లి అన్నారు. ఈ సందర్భంగా 18 ఏళ్ళు నిండినవారికి ఓటు హక్కు కల్పించి వారికి గుర్తింపు కార్డులిచ్చారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇటీవల నిర్వహించిన పోటీల్లో గెలుపొందినవారికి బహుమతులిచ్చారు. జేసీలు గణేష్‌కుమార్, విదేహ్‌ఖరే, ఆర్డీఓ హుస్సేన్‌సాహెబ్, ఆర్‌ఐఓ వరప్రసాద్, సుడా కార్యదర్శి నందన్ తదితరులు పాల్గొన్నారు.




# సాధికారత వైపు నడవాలి

**- జాతీయ బాలికా దినోత్సవంలో విఎస్‌యు వీసీ సుందరవల్లి**

బాలికలు సమాజంలోని సమస్యలను ఆత్మవిశ్వాసంతో అధిగమించి సాధికారతవైపు అడుగులు వేయాలని విక్రమసింహపురి విశ్వవిద్యాలయం ఉప కులపతి సుందరవల్లి పిలుపునిచ్చారు. ఈనెల 24న విఎస్‌యులో జరిగిన జాతీయ బాలికా దినోత్సవంలో ఆమె పాల్గొని బాలికలు సమాజంలో ఎదుర్కొంటున్న సమస్యల గురించి వివరించారు. బాలికల పట్ల ఎవరూ వివక్ష చూపకూడదన్నారు. బాలికల సంరక్షణకు ఉన్న చట్టాలను, బాలికలకు అన్ని విధాలా అండగా ఉండేందుకు ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను ఈ కార్యక్రమంలో పాల్గొన్న జేసీ రోజ్‌మాండ్ తెలియజేశారు. బాలికల సంరక్షణలో తల్లితండ్రులు ముఖ్యపాత్ర పోషించాలని విఎస్‌యు రిజిస్ట్రార్ డా.ఎల్ విజయకృష్ణారెడ్డి అన్నారు. విఎస్‌యు రెక్టార్ చంద్రయ్య, ప్రిన్సిపాల్ సుజా ఎస్ నాయర్, డా. కె.సునీత, డా. వై.విజయ, డా.ఆర్ మధుమతి తదితరులు పాల్గొన్నారు.

## నెల్లూరు కబుర్లు

**'ఈబీసీ నేస్తం'..**

# పేదలకు ఆపన్నహస్తం

- **జిల్లాలో 27 వేలమందికి.. 41.27 కోట్లు**



ఈబీసీ నేస్తం పథకం ద్వారా ఓసి వర్గాలకు (అగ్రవర్ణాలకు) చెందిన జిల్లాలోని 27,517 మంది పేదల ఖాతాల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 41,27,55,000 రూపాయలను జమచేశారు. తాడేపల్లిలోని సిఎం క్యాంప్ కార్యాలయం నుంచి సిఎం ఈ కార్యక్రమాన్ని ఈనెల 25న ప్రారంభించారు. ఆ కార్యక్రమంలో నెల్లూరు కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు, ఎమ్మెల్సీ బల్లి కల్యాణచక్రవర్తి తదితరులు పాల్గొన్నారు. ఓసి వర్గాలకు చెందిన 45 నుంచి 60 ఏళ్ళలోపు పేద అక్కచెల్లెమ్మలకు ఏటా 15వేల రూపాయల వంతున ఈ పథకం కింద మూడేళ్ళపాటు ఇస్తారని కలెక్టర్ చెప్పారు. అగ్రవర్ణ పేదల అవసరాలు తీర్చేందుకు వారికి మెరుగైన జీవనోపాధి కలిగించేందుకు ముఖ్యమంత్రి ఈ పథకం ప్రవేశపెట్టారని, ఈ పథకం కింద అర్హత ఉన్నవారు ఇంకా ఎవరైనా ఉంటే గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అనంతరం 41.27కోట్ల రూపాయల నమూనా చెక్కును లబ్దిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జేసీ రోజ్‌మాండ్, బీసీ కార్పొరేషన్ ఇ.డి వి.బ్రహ్మానందరెడ్డి, డిఆర్‌డిఏ పీడీ సాంబశివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## అత్యాధునిక ఆలోచనలు కలిగిన పాత తరం వైద్యుడు

# డాక్టర్ జేపీ రెడ్డి కన్నుమూత

**జేపీ రెడ్డి అంటే సాధారణ వ్యక్తి కాదు.. ఆయనొక బ్రాండ్**

ప్రముఖ చర్మ, సెక్స్ వ్యాధుల నిపుణులు డాక్టర్ జేపీ రెడ్డి జనవరి 22వతేదీ తన 74వ ఏట తుదిశ్వాస విడిచారు. గత కొంతకాలంగా ఆయన వృత్తిని వదిలి పెట్టి బెంగళూరులో విశ్రాంత జీవితాన్ని గడుపుతున్నారు. శనివారం అక్కడే తన స్వగృహంలో గుండె పోటుతో కన్నుమూశారు. అంత్యక్రియలు ఆదివారం బెంగళూరులోనే జరిగాయి. జేపీ రెడ్డిగా ప్రసిద్ధి చెందిన ఆయన పూర్తిపేరు పెళ్ళకూరు జయప్రసాద్‌రెడ్డి. కొడవలూరు మండలం బొడ్డువారిపాలెంలోని అతి సామాన్య రైతు కుటుంబంలో పెళ్ళకూరు సుందర రామిరెడ్డి – యశోదమ్మ దంపతుల 6(చివరి)వ సంతానంగా ఆయన జన్మించారు. ఆయన పెద్దక్క జ్యోత్స్న, పెద్దన్న వెంకటసుబ్బారెడ్డి, చిన్నక్క డాక్టర్ జయప్రద, చిన్నన్న రవీంద్రరెడ్డి, మరో చిన్నక్క జమున... అందరూ విద్యావంతులే. వారందరి స్ఫూర్తితోనే జేపీ రెడ్డి కూడా వైద్య శాస్త్రం అభ్యసించారు. 1976లో డిగ్రీ పూర్తి చేశారు. 1974లో తన పెద్దక్క జ్యోత్స్న – కోడూరు శ్రీరంగారెడ్డిల కుమార్తె రాధామృతను పెళ్లి చేసుకున్నారు. 1980 నుండి నెల్లూరు పొగతోటలో ప్రాక్టీస్ మొదలు పెట్టి దాదాపు 4 దశాబ్దాల పాటు తన వైద్య వృత్తిని కొనసాగించారు.

### వ్యాధిని కనిపెట్టడంలో దిట్ట..

దీర్ఘకాల చర్మవ్యాధులకు మూలకారణాన్ని కనిపెట్టి చికిత్సనందించడంలో కూడా జేపీ రెడ్డి ప్రసిద్ధి. చర్మ వ్యాధుల వైద్యుడిగానే కాకుండా నెల్లూరులో తొలి సెక్సాలజిస్టుగా కూడా ఆయన ప్రాచుర్యాన్ని పొందారు. తనకున్న సాహితీ అభిలాషతో అనేక వ్యాసాలు కూడా రాసి పత్రికలకు పంపేవారు. చర్మ, సెక్స్ వ్యాధుల నివారణా చిట్కాలను, చికిత్సలపై కూడా అనేక వ్యాసాలను రాశారు. జిల్లాలో మాగుంట, జక్కా, ఆదాల, గునుపాటి, తుంగా కుటుంబాలతో పాటు ఇంకా అనేక రాజకీయ, పారిశ్రామిక, వ్యాపార ప్రముఖులతో జేపీ రెడ్డికి మంచి స్నేహ సంబంధాలు ఉండేవి. ఆయన ఎక్కడ ఉంటే అక్కడ సరదా, చతురతతో, ఛలోక్తులతో నవ్వులు కురిపించేవారు. తాను నెల్లూరు వదిలి ఏ మహానగరానికి వెళ్లినా అక్కడ ఎక్కడా దొరకని అరుదైన వస్తువులను శోధించి సాధించేవారు. అవి తెచ్చి తన మిత్రుల కుటుంబసభ్యులకు కానుకలుగా ఇచ్చేవారు.

జేపీ రెడ్డికి భార్య రాధామృత, కుమారులు చైతన్య, సమన్య ఉన్నారు. ఇంటి పెద్దదిక్కును కోల్పోయిన జేపీ రెడ్డి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలుపుతోంది 'లాయర్'.



### ఆయనే ఒక బ్రాండ్...

1948 అక్టోబర్ 28 ఈ దేశానికి స్వాతంత్రం వచ్చిన 14 నెలలకే పుట్టిన జేపీ రెడ్డి పేరుకి పాతతరం వాడైనా ఆయన ఆలోచనలు మాత్రం ఆధునికంగా ఉండేవి. ఆయన తలపై ధరించే హ్యాట్ దగ్గర నుండి కాళ్లకు వేసుకునే చెప్పుల వరకూ తానే స్వయంగా డిజైన్ చేసి తయారు చేయించుకోవడం ఆయన ప్రత్యేకత. బ్రాండెడ్ వస్తువులు ఏవీ వాడేవారు కాదు. తానే స్వంతంగా రూపకల్పన చేసుకుని తానే ఒక బ్రాండ్‌గా పిలిపించుకునేవారు. వైద్యుడిగా తనకు తానే సాటి అనిపించుకున్న జేపీ రెడ్డి వైవిధ్యంలో కూడా తనకెవరూ లేరు పోటీ అన్న రీతిలో ఎన్నో కొత్త పద ప్రయోగాలను చేయడంతో పాటు 1985 నుండి ఆ తరువాతి కాలంలో ఎంతో మంది ఆయన శిష్యులకు, మిత్రుల సంతానానికి కొత్త తరహాలో పెళ్ళి పత్రికలు తయారుచేయించి ఇచ్చేవారు. మేటర్‌లో సైతం నూతన ఒరవడిని చూపించడంతో పాటు ఆ మేటర్‌కు తగ్గట్లుగా కార్డుని ఎలా తయారు చేయించడంలో కూడా ఆయనే శ్రద్ధ తీసుకునేవారు. 1980–90 ప్రాంతాలలో జేపీరెడ్డి రూపకల్పన చేసిన పెళ్ళి పత్రికల తరహాలో ఇప్పటికీ చాలామంది యువతీయువకులు తమ కార్డులను ముద్రించుకోవడానికి ఆసక్తి చూపిస్తున్నారంటే ఆయన ఆధునిక ఆలోచనా విధానానికి ఇదే పెద్ద నిదర్శనం. ఇక కొత్త సంవత్సరంతో పాటు ముఖ్యమైన పండుగలప్పుడు జేపీ రెడ్డి ఈసారి ఏం ప్రయోగం చేయబోతున్నారో...? అని ఆయన సహచర వైద్యులు, ఆప్తులు, ఆత్మీయులు ఎదురుచూసేలా ఒక్కొక్క సందర్భంలో ఒక్కొక్క కొత్త ఆలోచనతో, సమాజానికి ఉపయోగపడే సందేశాత్మకమైన సమాచారంతో గ్రీటింగ్ కార్డులను ఆయన తయారు చేయించేవారు.



### జేపీ రెడ్డి సృష్టించిన అద్భుతాలలో కొన్ని...






కొత్త ఏడాదిని సినిమా ప్రొడక్షన్‌తో పోలుస్తూ... ఫిలింపై 1991లో జేపీ రెడ్డి గ్రీటింగ్

1990లో జరిగిన 'లాయర్' సంపాదకుడు శివప్రభాత్‌రెడ్డి (ప్రభు) వివాహ వ్యక్తిగత ఆహ్వాన పత్రికను తాళిబొట్టు ఆకారంలో తయారు చేయించిన జేపీ రెడ్డి



1994లో కొత్త ఏడాది మూడు పువ్వులు.. ఆరు కాయలుగా ఉండాలని సూచిస్తూ పూలు, పళ్ళతో జేపీరెడ్డి గ్రీటింగ్






'హార్ట్'లీ వెల్‌విషెస్ అంటూ గుండె బొమ్మ ఆకారంతో 1992 కొత్త సంవత్సర గ్రీటింగ్




'1199' తేదీని హైలైట్ చేస్తూ... షైన్ ఫేట్ ఫ్రమ్ దిస్ ఫైన్ డేట్ అంటూ 1999 గ్రీటింగ్

ఇలాంటి గ్రీటింగ్‌లు, పెళ్లి పత్రికలు, కొటేషన్లు ఎన్నింటికో సృష్టికర్త డాక్టర్ జె.పి.రెడ్డి

**పిఆర్‌సి జీఓల రద్దుకు..**

# బీజేపీ నిరసన దీక్ష



నిరసన దీక్ష చేస్తున్న బీజేపీ నాయకులు

రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన పిఆర్‌సి జీఓలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్‌చేస్తూ నెల్లూరులోని బిజెపి నాయకులు ఈనెల 25న నిరసన దీక్ష చేశారు. నగరంలోని బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ నెల్లూరు పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షుడు గుండ్లపల్లి భరత్‌కుమార్ యాదవ్, రాష్ట్ర పార్టీ అధికార ప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి తదితరులు మాట్లాడుతూ పిఆర్‌సి జీఓల రద్దుకోసం ఉద్యోగులు, ఉపాధ్యాయులు చేస్తున్న ఆందోళనకు సంఘీభావం ప్రకటించారు. వైకాపా ప్రభుత్వం అప్రజాస్వామిక విధానాలను అవలంభించడం దారుణమని, ఉద్యోగులపై అధికారపార్టీవారు దుష్ప్రచారం మానుకోవాలని, వెంటనే ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని వారు కోరారు. నమామి గంగే రాష్ట్ర ప్రముఖ్ మిడతల రమేష్, బీజేపీ నాయకులు మండ్ల ఈశ్వరయ్య, బి.శ్రీనివాసులు, పి.నారాయణరెడ్డి, రోశయ్య, నళిని తదితరులు పాల్గొన్నారు.

# వేడుకగా జాతీయ పర్యాటక దినోత్సవం

అజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా ఈనెల 25న నెల్లూరులో జాతీయ పర్యాటక దినోత్సవం వేడుకగా జరిగింది. పర్యాటకశాఖ డివిజనల్ మేనేజర్ ఏఎస్ శివారెడ్డి ఆధ్వర్యంలో నగరంలోని సాయి మహావిద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎంతోమంది విద్యార్థినీ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పర్యాటక ప్రాంతాల సందర్శన గురించి, వాటి విశిష్టత గురించి ఆయన విద్యార్థులకు తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. విద్యాలయం నిర్వాహకులు, పర్యాటకశాఖ సూపర్‌వైజర్ ఏ.ప్రతాప్‌రెడ్డి తదితరులు ఈ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

# పారదర్శకంగా సుపరిపాలన

## - రిపబ్లిక్ దినోత్సవ వేడుకల్లో జిల్లా కలెక్టర్



జిల్లా సర్వతోముఖాభివృద్ధికి జిల్లాలో అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు దిగ్విజయంగా అమలుచేస్తున్నామని జిల్లా కలెక్టర్ కె.వి.ఎన్.చక్రధర్ బాబు అన్నారు. 73వ గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా జనవరి 26 బుధవారం నాడు నెల్లూరు పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో కలెక్టర్ చక్రధర్‌బాబు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసులు, ఎన్.సి.సి. దళాలచే గౌరవ వందనం స్వీకరించారు. జిల్లా ప్రజలందరికీ 73వ గణతంత్ర దినోత్సవ వేడుకల శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా ప్రగతిపై ప్రసంగిస్తూ, పారదర్శకతతో కూడిన సుపరిపాలన అందించడంతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలు అర్హులందరికి అందించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం వాలంటరీ వ్యవస్థ మరియు గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని జిల్లాలో 660 రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి గ్రామాల్లోనే రైతులకు విస్తృతమైన సేవలు అందిస్తోందన్నారు. ఈ రబీ సీజన్‌లో 2 లక్షల 26వేల 197 హెక్టార్లలో పంటలు సాగు చేయడం జరిగిందని, వైఎస్ఆర్ రైతు భరోసా పథకం కింద జిల్లాలో అర్హులైన ప్రతి రైతు కుటుంబానికి పెట్టుబడి రాయితీగా 13,500 రూపాయలు చొప్పున ఇప్పటివరకు రెండుసార్లు 2 లక్షల 43 వేల మంది రైతు కుటుంబాలకు 328 కోట్ల రూపాయలను రైతుల ఖాతాలలో జమచేయడం జరిగిందన్నారు.

### వేగవంతంగా పెన్నా బ్యారేజీ పనులు :

జిల్లాలో 150.35 కోట్ల రూపాయలతో పెన్నా బ్యారేజి నిర్మాణం చేపట్టగా 86 శాతం పనులు పూర్తయ్యాయని, అలాగే 171.50 కోట్ల రూపాయలతో సంగం బ్యారేజి నిర్మాణం చేపట్టగా 89 శాతం పనులు పూర్తి కావడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. ఆనం సంజీవరెడ్డి సోమశిల ఎత్తిపోతల పథకం కింద ఫేజ్-1 కింద 853 కోట్ల రూపాయలతో 43,200 ఎకరాలకు సాగునీరు అందించేందుకు చేపట్టిన పనుల్లో 62.37 శాతం పనులు పూర్తయ్యాయని, సోమశిల- కండలేరు వరద కలువ ద్వారా రోజుకు 2 టి.ఎం.సి.ల నీటిని కండలేరుకు తరలించుటకై 776 కోట్ల రూపాయలతో పనులను ప్రారంభించామని అన్నారు. 236.91 కోట్ల రూపాయలతో చేపట్టిన 2,584 వరద నష్ట పునరుద్ధరణ పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. నవరత్నాల పథకాలు, ఇతరత్రా ప్రభుత్వం అమలుచేస్తున్న అన్ని పథకాలను జిల్లాలో ఏవిధంగా అమలుచేస్తున్నదీ కలెక్టర్ సవివరంగా తెలియజేశారు. జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరం 15వ ఆర్థిక సంఘం నిధుల నుండి 11.73 కోట్ల రూపాయల వ్యయంతో 34 సమగ్ర రక్షిత మంచినీటి సరఫరా పథకాల పనులు చేపట్టడం జరిగిందని, అలాగే జల జీవన్ మిషన్ కింద 9.33 కోట్ల రూపాయలతో 35,042 ఇళ్ళకు కుళాయిలు ఏర్పాటు చేయటం జరిగిందని కలెక్టర్ తెలిపారు.

జిల్లాలో కోవిడ్ నియంత్రణకు జిల్లాలో వాక్సినేషన్ ప్రక్రియ పటిష్టంగా చేపట్టడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. మొదటి డోసు వాక్సినేషన్ పూర్తి చేసి జిల్లా జాతీయ స్థాయిలో మొదటి స్థానంలో నిలిచిందని వివరించారు. కోవిడ్‌తో 1,173 మంది మరణించగా ఒక్కో కుటుంబానికి 50 వేల రూపాయల వంతున వారి కుటుంబ సభ్యుల ఖాతాకు ఎక్స్‌గ్రేషియా జమ చేసినట్లు తెలిపారు. జిల్లాలో అక్షర చైతన్యం అనే ప్రత్యేక కార్యక్రమాన్ని ఈ సంవత్సరం ఆగస్టు 16వ తేదీన ప్రారంభించి జిల్లాలోని 8,426 అక్షర కేంద్రాల ద్వారా 1,16,566 మందికి వయోజన విద్యను అందించి అక్షరాస్యులుగా చేయడంతో, జిల్లా అక్షరాస్యత శాతం 68.2 నుండి 84 శాతానికి పెరిగిందని కలెక్టర్ వివరించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులకు జిల్లా కలెక్టర్ జ్ఞాపికలను అందచేశారు. జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖలలో పనిచేసి తమ విధుల పట్ల ఉత్తమ సేవలందించిన 545 మంది ఉద్యోగస్తులకు జిల్లా కలెక్టర్ ప్రశంసా పత్రాలను అందచేశారు.

ఈ వేడుకల్లో జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ ఆనం అరుణమ్మ, శాసనమండలి సభ్యులు బల్లి కల్యాణ్ చక్రవర్తి, సర్వేపల్లి, నెల్లూరు రూరల్, సూళ్ళూరుపేట శాసన సభ్యులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కిలివేటి సంజీవయ్య, నెల్లూరు నగర మేయర్ పొట్లూరి స్రవంతి, రాష్ట్ర కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ఛైర్మెన్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, ఎ.పి. కార్పొరేషన్ ఫర్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ ఛైర్‌పర్సన్ షేక్ సైదాని, జిల్లా పోలీసు సూపరింటెండెంట్ సిహెచ్ విజయారావు, జాయింట్ కలెక్టర్లు హరేందిరప్రసాద్, గణేశ్‌కుమార్, విధేహ్ ఖరే, నెల్లూరు నగర పాలక సంస్థ కమిషనర్ దినేష్‌కుమార్, జాయింట్ కలెక్టర్ రోజ్‌మాండ్, డి.ఎఫ్.ఓ షణ్ముఖకుమార్, నూడా ఛైర్మెన్ ముక్కాల ద్వారకానాథ్, డి.సి.ఏం.ఎస్ ఛైర్మన్, వీరి చలపతి, రాష్ట్ర మత్స్యకారుల కో-ఆపరేటివ్ ఫెడరేషన్ ఛైర్మెన్ కొండూరు అనిల్‌బాబు. విజయ డెయిరీ ఛైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, నెల్లూరు మార్కెటింగ్ సొసైటీ ఛైర్మెన్ ఏసునాయుడు, జిల్లా అధికారులు, స్వాతంత్ర్య సమరయోధులు, వివిధ పాఠశాలల విద్యార్థిని విద్యార్థులు, పెద్దసంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.



### అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు :

రిపబ్లిక్ దినోత్సవం సందర్భంగా నెల్లూరు దర్గామిట్టలో ఉన్న జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల, కోవూరులోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల, ఇనమడుగులోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల, నెల్లూరులోని లిటిల్ ఏంజెల్స్ హైస్కూల్, వోవెల్ హైస్కూల్ విద్యార్థిని, విద్యార్థులచే దేశభక్తి ఉట్టిపడేలా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వివిధ ప్రభుత్వశాఖల శకటాలు ఆకట్టుకున్నాయి. శకటాల ప్రదర్శనలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ శకటానికి ప్రథమ బహుమతి, రెవెన్యూ శాఖకి ద్వితీయ, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ శకటానికి తృతీయ బహుమతి లభించాయి.









## శ్రీసిటీలో.. రిపబ్లిక్ దినోత్సవ వేడుకలు

శ్రీసిటీలో జనవరి 26న 73వ గణతంత్ర దినోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. శ్రీసిటీ బిజినెస్ సెంటర్ వద్ద తమిళనాడు మాజీ ఇన్స్‌పెక్టర్ జనరల్ ఎం.సి సారంగన్ మువ్వన్నెల జాతీయ జెండాను ఎగురవేశారు. శ్రీసిటీ సెక్యూరిటీ సిబ్బంది కవాతు నిర్వహించారు. శ్రీసిటీ ప్రగతి, అభివృద్ధిని ప్రశంసించిన ఆయన, వెనుకబడిన ప్రాంతంలో పుష్కలంగా ఉపాధి అవకాశాలను అందించడానికి శ్రీసిటీ యాజమాన్యం చేస్తున్న కృషిని అభినందించారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఈ సందర్భంగా తన ప్రకటనలో శ్రీసిటీ భాగస్వాములందరికీ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. శ్రీసిటీ డీఎస్పీ జగదీశ్‌నాయక్, శ్రీసిటీ ప్రెసిడెంట్ (ఆపరేషన్స్) సతీష్ కామత్, శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ (కస్టమర్ రిలేషన్స్) సి.రమేష్‌కుమార్ సెక్యూరిటీ, విజిలెన్స్ హెడ్ రమేష్ తదితరులు పాల్గొన్నారు. పలువురు సెక్యూరిటీ గార్డుల సేవలకు గుర్తింపుగా వారికి నగదు పురస్కారాలను అందజేశారు.

## ‘విపిఆర్ విద్య’లో.. జెండా పండుగ



విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ‘విపిఆర్ విద్య’లో జనవరి 26న గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపకులు రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి.. విపిఆర్ ఫౌండేషన్ ఛైర్‌పర్సన్ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి విద్యార్థులకు, ఉపాధ్యాయులకు రిపబ్లిక్ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకల్లో పాల్గొన్న విపిఆర్ ఫౌండేషన్ సిఇఓ ప్రొ.వి.నారాయణరెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఎందరో మహనీయుల త్యాగనిరతితో దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని, వాటి ఫలాలు నేడు ప్రజలందరికీ అందుతున్నాయని అన్నారు. గణతంత్ర దినోత్సవం రోజునుంచే భారతీయులకు పూర్తి స్వాతంత్ర్యం వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో విపిఆర్ విద్య ప్రిన్సిపాల్ వి.టి శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ ఆర్‌హెచ్ కళ తదితరులు పాల్గొన్నారు.

## జయభారత్‌కు.. లక్షా 50వేల విరాళం



అల్లూరుకు చెందిన శిద్దా వెంకటరమణయ్య కుమారుడు శిద్దా నీలేశ్ వారి జేజినాయన దివంగత శిద్దా కృష్ణమూర్తి జ్ఞాపకార్థం నెల్లూరులోని జయభారత్ ఆసుపత్రిలో అమలుచేస్తున్న సంజీవని వైద్యసేవా పథకానికి లక్షా 50 వేల రూపాయలను ఇటీవల విరాళంగా అందజేశారు. ఈ పథకం కింద దాతల కోరిక మేరకు కృష్ణమూర్తి వర్ధంతి సందర్భంగా ప్రతిఏటా పేదప్రజలకు ఉచిత వైద్యసేవలతో పాటు పండ్లు పంపిణీ చేయడం జరుగుతుందని ఆసుపత్రి జనరల్ మేనేజర్ గురుప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎం వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.




# ప్రభుత్వాలు... పత్రికలు చదివితే చాలు!

రాజకీయపార్టీలకు ఓట్లు కావాలి... అధికారంలోకి రావడానికి గానీ వచ్చిన అధికారాన్ని నిలబెట్టుకోడానికి గానీ. అయితే, ఓట్లకూ, పాలనా సామర్థ్యానికి సంబంధం లేదు. ఓట్లు రాబట్టడానికి, ప్రజలను ఆకర్షించే స్లోగన్లు, భ్రమల్లో ముంచెత్తే టక్కు, టమార విద్యలు, ఓట్ల కొనుగోలు శక్తి, కండ బలం, అసత్యాల ఉత్పత్తి, విస్తృత పంపిణీ సామర్థ్యం, ఉత్తుత్తి హామీలు పుంఖాను పుంఖాలుగా గుప్పించకలిగిన నేర్పు, నైపుణ్యం... మొదలైన సుగుణాలు అవసరమవుతాయి. ఉత్తరాదిన ఉన్న బీహార్, ఉత్తరప్రదేశ్ వంటి పెద్దరాష్ట్రాల నుంచి దక్షిణాదిన అట్టడుగున ఉన్న కేరళ వరకు అన్ని రాష్ట్రాలలోనూ రాజకీయ పార్టీలు అధికారంలోకి రావడానికి అవలంభిస్తున్న రాజమార్గం ఇదే. కానీ, అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ నిర్వహణకు ఇవేమీ అక్కరకు రావు.

అన్నిటికంటే ముందుగా సానుకూల దృక్పథం (పాజిటివ్ మైండ్), సర్వమత, కుల, ప్రాంత, సామజిక స్థితిగతులన్నింటినీ సమభావంతో చూడగలిగిన మానసిక స్థితి ప్రభుత్వ యంత్రాంగానికి ముఖ్యం. ఎందుకంటే, ఏ ప్రభుత్వమైనా... రాష్ట్రంలోని ప్రతి పౌరుడి చట్టబద్ధమైన, గౌరవప్రదమైన జీవనానికి బాసటగా ఉంటుంది. ప్రభుత్వానిదే బాధ్యత. రాజ్యాంగ పరమైన విధి.

అయితే ఎవరు... ఏ ప్రాంతంలో... ఎందుకు... ఎవరివల్ల... ఎలా నష్టపోతున్నారో... బాధలు పడుతున్నారో, గౌరవాన్ని కోల్పోతున్నారో.... తెలుసుకోవడం ప్రభుత్వానికి ఒక పట్టాన సాధ్యం కాదు.

కోట్లాది జనాభా అనేది ఒక ప్రతిబంధకం. సమాజంలో ఆర్థిక, సామాజిక, మత, కుల అసమానతల ఫలితంగా క్షేత్రస్థాయిలో నిత్యం ఏం జరుగుతుందో... అధికార యంత్రాంగం ద్వారా తెలుసుకోవడం అధిక జనాభా కారణంగా ప్రభుత్వానికి సాధ్యం కాదు.




దీనికితోడు, గౌరవంగా జీవించడానికి ఒక పౌరుడికి కావలసిన సపోర్ట్‌ను అందించవలసిన అధికార యంత్రాగంలో సమస్త రాగద్వేషాలు ఉండడం ఒక ప్రధాన ప్రతిబంధకం. ఆ రాగద్వేషాల ప్రాతిపదికగానే, క్షేత్రస్థాయిలో అధికార యంత్రాంగం వ్యవహరిస్తూ ఉంటుంది. ఈ యంత్రాంగం ప్రభుతాన్ని తప్పుదారి పట్టించే అవకాశం కూడా లేకపోలేదు.

అందుకే, ప్రభుత్వానికి ఉన్న ఒక మంచి సమాచార సేకరణ మార్గం దినపత్రికలు. ఒక్క, రాజకీయ అంశాలకు సంబంధించి ఆయా పార్టీలపై వాటిల్లో రాగద్వేషాలు కనిపిస్తాయి కానీ ప్రజల సమస్యలను, అధికారుల దౌష్ట్యాలను, లంచగొండితనాన్ని వెలుగులోకి తీసుకురావడంలో దాదాపుగా అన్ని పత్రికలూ ధర్మబద్ధంగానే వ్యవహరిస్తాయి అనేది జనవాక్యం.

దీనికి కారణాలు లేకపోలేదు.

1. ఏ పత్రికకైనా విలేకరులు కూడా స్థానికంగానే ఉంటారు. 2. ప్రజలతో, స్థానిక రాజకీయ నాయకత్వంతో, సమాజంలోని దాదాపుగా అన్ని వర్గాలతో వారు నిత్య సంబంధాలు కలిగి ఉంటారు. 3. వీరిలో అత్యధికులు మధ్య తరగతి, దిగువ మధ్య తరగతికి చెందినవారు అయివుంటారు 4. అందువల్ల, స్థానిక అధికార యంత్రాంగం 'మైండ్‌సెట్'’పై పూర్తి అవగాహన కలిగిన వారై ఉంటారు.

తమ పరిధిలో ఎవరు, ఎందుకు, ఎవరి చేతిలో, ఎలా..., అన్యాయానికి, అక్రమానికి, అఘాయిత్యానికి గురి అయ్యారో అక్కడి అధికార యంత్రాంగం ఆ సంఘటపై ఎలా స్పందించిందో అనే అంశాలపై వారు పూర్తి అవగాహన కలిగి ఉంటారు.

ఆ అవగాహనతోనే వారు వార్తలు రాస్తారు. అవి జిల్లా ఎడిషన్లలో ప్రచురితమవుతాయి. ఉదాహరణకు ప్రకాశం జిల్లా ఎడిషన్‌లో ప్రచురితం అయ్యే ప్రజల ఈతి బాధలు... నెల్లూరు జిల్లాల ఎడిషన్లలో కనిపించవు. మరి, నెల్లూరు జిల్లా ప్రజల ఈతి బాధలు ప్రచురణకు చోటు ఉండాలి కదా! జిల్లాలలోని ప్రజల బాధలను ప్రచురించడంలో ప్రభుత్వ అనుకూల పత్రికలు, వ్యతిరేక పత్రికలు అనే తారతమ్యం ఉండదు. అయినప్పటికీ ఏ జిల్లా సమస్యలు ఆ జిల్లాకే పరిమితం అవడం వల్ల ఇవన్నీ ప్రభుత్వ దృష్టికి వచ్చే అవకాశం అంతగా లేదు. తమ దుశ్చేష్టలు ప్రభుత్వం దృష్టికి వెళ్లే అవకాశాలు కూడా తక్కువే అన్న భావన కూడా అక్రమార్కులకు మరింత ధైర్యాన్ని ఇస్తుంది.

నిజానికి, ఈ దినపత్రికలలో రోజువారీ వచ్చే జిల్లా ఎడిషన్లలో ప్రచురితమయ్యే ఘరానా శక్తుల అరాచకాలు, దౌర్జన్యాలు, దోపిడీలు, అత్యాచారాలు, హత్యాచారాలు, మోసాలు పరిగణనలోకి తీసుకుని రాగద్వేషాలకు అతీతంగా బాధితులకు తక్షణ న్యాయం అందించే నిష్పాక్షిక అధికారయంత్రాంగం ఒకటి ప్రభుత్వానికి నియోజక వర్గ, జిల్లా, రాష్ట్రస్థాయిలోఉంటే చాలు. ఈ యంత్రాంగం ఆయా సందర్భాలను బట్టి ప్రభుత్వానికి నివేదిక అందిస్తుంది. ఆ నివేదికలపై ప్రభుత్వం సత్వర ఉపశమన చర్యలు తీసుకుంటే బాధితులకు అంతులేని ఊరట లభిస్తుంది. వేరే సానుకూల ప్రచారం అవసరం లేదు. సమాజంలోని వివిధ రకాల వర్గాలవారికి కూడా 'ఈ ప్రభుత్వం మాది' అనే భరోసా భావన కలుగుతుంది.

నియోజకవర్గానికి ఎన్నికల కమిషన్ నిర్ణయించిన 40 లక్షల మొత్తమే అధికార పార్టీ అభ్యర్థికి సరిపోతుంది. ఇంకా మిగిలిపోతుంది కూడా. ఎందుకంటే అధికారపార్టీ అభ్యర్థి అనగానే, ప్రజలు ఎదురేగి స్వాగతం చెబుతారు. రూపాయి ఆశించకుండా ఓటు వేస్తారు. చిన్నపిల్లలు తమ తల్లిదండ్రుల చెయ్యి పట్టుకుని నడిచినట్టుగా ప్రజలు అధికార పార్టీ చెయ్యిపట్టుకుని నడుస్తారు.

సమాజంలోని పౌరులు 'ఒక అన్యాయం, ఒక అక్రమం, ఒక అరాచకం, ఒక దోపిడీ, ఒక దౌర్జన్యం, ఒక మోసం, ఒక కబ్జా... వంటి వాటికి లోనైనప్పుడు సత్వరం స్పందించగలిగిన 'ప్రభుత్వం మనది..' అనే భావన ప్రజలకు కలిగినప్పుడు ప్రభుత్వం నుంచి వారు ఎటువంటి తాయిలాలను ఆశించరు. ఎందుకంటే సమాజంలో నూటికి 95 శాతం మంది స్వయంగా బతకగలిగినవారే. మిగిలిన అయిదు శాతం మందికే ప్రభుత్వ చేయూత అవసరం, వృద్ధులు, మానసిక... శారీరక అంగవైకల్యం చేత సంపాదించుకోవడం కుదరని దురదృష్టవంతులు, సంపాదనాపరులైన భర్తలను కోల్పోయి, వేరే జీవనాధారం లేని మహిళలు, అనాథలైన మైనర్ పిల్లలు... మొదలైన వారికి ప్రభుత్వం చేయూత కావాలి. మిగిలిన వారు తమ బతుకులు తాము బతక గలిగిన వారే. కావలసిందల్లా అలా గౌరవప్రదంగా సమాజంలో బతకగలిగిన పరిస్థితులు మాత్రమే. పూలల్లో దారం లాగా ప్రభుత్వం వ్యవహరించగలిగినప్పుడు అధికారపార్టీని ఓడించడం ఏ రాజకీయ పార్టీకీ సాధ్యం కాదు.

అలా వ్యవహరించడానికి, ప్రభుత్వానికి ఉపకరించే వ్యవస్థ పత్రికల జిల్లా ఎడిషన్లు. ఆ విలేఖరులే... జీతం, భత్యం లేని సమాచార సారథులు. సమాజ శ్రేయోభిలాషులు.

**- భోగాది వేంకట రాయుడు**

bhogadirayudu2152@gmail.com

## టీకా వేసుకోండి..
# కరోనాను తరిమికొట్టండి

**నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి**



విద్యార్థులకు వ్యాక్సినేషన్‌ను పరిశీలిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

ప్రతిఒక్కరూ టీకా వేసుకుని కరోనా మహమ్మారిని తరిమికొట్టాలని రాష్ట్ర కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ఛైర్మెన్, ఎన్‌బికెఆర్ విద్యాసంస్థల కరెస్పాండెంట్ నేదురుమల్లి రామ్ కుమార్‌రెడ్డి అన్నారు. ఈనెల 24న ఆయన కోట మండలం విద్యానగర్‌లోని నేదురుమల్లి కళాభవన్‌లో కోవిడ్ మెగా వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కోవిడ్‌ను కట్టడి చేయాలంటే ప్రతిఒక్కరూ రెండు డోసుల టీకా వేయించుకోవాలని ఆయన చెప్పారు. ఎన్‌బికెఆర్ విద్యాసంస్థల్లోని సిబ్బందికి నూటికి నూరుశాతం, విద్యార్థులకు 70 శాతం వ్యాక్సినేషన్ పూర్తయిందని తెలిపారు. జిల్లా కలెక్టర్, వైద్యాధికారుల కృషి వల్ల వ్యాక్సినేషన్‌లో మన జిల్లా రాష్ట్రంలో ప్రథమస్థానంలో ఉందని సంతోషం వ్యక్తం చేశారు. విద్యార్థులతో పాటు పరిసరగ్రామాల నుంచి అనేకమంది ప్రజలు కూడా ఇక్కడికి వచ్చి టీకా వేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కాలేజీ డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ రామకృష్ణారెడ్డి, ప్రాంగణ ఎంపికల అధికారి డాక్టర్ కిషాంధర్, కోట-వాకాడు ఎస్‌ఐలు పుల్లారావు, రఘునాథ్, ఎన్‌ఎస్‌ఎస్ ఆఫీసర్ శ్రీనివాసులు, కో-ఆర్టినేటర్ రాజేష్‌తో పాటు షనీల్‌రెడ్డి, విజయసారథిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గూడూరు డివిజన్ వార్తలు



రంగురంగుల విద్యుత్‌దీపాలతో మెరిసిపోతున్న గూడూరు రైల్వేస్టేషన్

# రైల్వేస్టేషన్ ప్రాంగణంలో గణతంత్ర వేడుకలు

గూడూరు రైల్వేస్టేషన్ ఆవరణంలో 73వ గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్టేషన్ సూపరింటెండెంట్ పి.వెంకటేశ్వరరావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ వేడుకల్లో ఐపిఎఫ్ లక్ష్మీనారాయణ, జిఆర్‌పి ఎస్సై కొండపనాయుడు, ఇంజనీర్ రామకృష్ణ, సిబిఎస్‌ఆర్ ఏ.వెంకటేశ్వర్లు, రైల్వే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. కాగా, రిపబ్లిక్ డే సందర్భంగా స్టేషన్ సూపరింటెండెంట్ పి.వెంకటేశ్వరరావు గూడూరు రైల్వేస్టేషన్‌కి ఏర్పాటు చేసిన ప్రత్యేక లైటింగ్ గూడూరు ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది.



జెండా వందనం చేస్తున్న గూడూరు రైల్వేస్టేషన్ సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు

## ప్రతిభకు పురస్కారం





ఈ నెల 26న నెల్లూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన రిపబ్లిక్ డే వేడుకల్లో జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు, జిల్లా ఎస్పీ విజయరావు చేతుల మీదుగా ఉత్తమ సేవా పథకాలు అందుకుంటున్న గూడూరు డిఎస్పీ ఎం.రాజగోపాల్‌రెడ్డి, గూడూరు రూరల్ సి.ఐ శ్రీనివాసులురెడ్డి



ఈ నెల 26న గూడూరులో జరిగిన 73వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఆర్డీఓ వి.మురళీకృష్ణ, ఎమ్మెల్యే వరప్రసాద్, స్వచ్ఛాంధ్రప్రదేశ్ ఛైర్‌పర్సన్ పొణకా దేవసేనల చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న గూడూరు తహశీల్దార్ బాలలీలారాణి



గూడూరులోని హజరత్ సయ్యద్ హాషిం హుసైనీ జాఫర్ మస్తాన్ ఔలియా దర్గా అవరణంలో దర్గా ముస్లిం వెల్ఫేర్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన గణతంత్ర వేడుకల్లో మాట్లాడుతున్న కమిటీ గౌరవాధ్యక్షులు షేక్ రియాజ్ అహ్మద్

## మీనోత్సవంతో...
# మారనున్న గిరిజనుల జీవితాలు

'మీనోత్సవం' కార్యక్రమంతో గిరిజనుల జీవితాలు మారనున్నాయని మత్స్యశాఖ ఏ.డి చాంద్‌బాషా ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'మీనోత్సవం' కార్యక్రమంలో భాగంగా నెల్లటూరు సమీపంలో ఉన్న రావిచెరువులో మత్స్యశాఖ ఏ.డి చాంద్‌బాషా, గూడూరు ఎమ్మార్వో బి.లీలారాణి, జడ్పీటీసీ యామిని, మహేందర్‌రెడ్డి, మునిరావులు 30వేలు, వేములపాళెం చెరువులో 70వేలు మోసు, గండి రకం జాతికి చెందిన చేపపిల్లలను విడుదల చేశారు. ఈ చేప పిల్లలు 5 నుండి 6 నెలల సమయంలో పట్టుకోవచ్చుని, ఈ రెండు చెరువుల కింద 49 గిరిజన కుటుంబాలు ఉండగా ప్రస్తుతం సొసైటీ అధ్యక్షుడుగా మణి కొనసాగుతున్నారని ఈ సందర్భంగా అధికారులు తెలియజేశారు. నెల్లూరు జిల్లా ఐటిడిఏ వారి ఆర్థిక సహాయంతో ఈ కార్యక్రమం చేపట్టగా, గిరిజన కుటుంబాలు ప్రభుత్వానికి, మత్స్యశాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ ఏ.ఓ గాయత్రి, దయాకర్, సాయి, రావి చెరువు, వేములపాళెం సొసైటీ ప్రెసిడెంట్ మణి, సొసైటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


చేపపిల్లలను చెరువులో వదులుతున్న మత్స్యశాఖ ఏ.డి చాంద్‌బాషా

# ముగిసిన ఎస్ఆర్ఎం క్రికెట్ టోర్నమెంట్

విందూరు హైస్కూల్ గ్రౌండ్‌లో ఈనెల 13న ప్రారంభమైన ఎస్ఆర్ఎం క్రికెట్ టోర్నమెంట్ ఇటీవల ముగిసింది. విజేతగా విందూరు కండ్రిగ జట్టు, రన్నర్స్‌గా చెంబడిపాలెం జట్లు నిలిచాయి. అనంతరం జరిగిన బహుమతి ప్రదానోత్సవ సభకు ముఖ్యఅతిథులుగా ప్రగతి సేవా సంస్థ అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్, సంభోదిని ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ సర్వీస్ సొసైటీ అధ్యక్షులు పెట్లూరు రాంప్రసాద్, కార్యదర్శి పెట్లూరు హరిప్రసాద్, పగడాలపల్లి సర్పంచ్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. విజేతలకు కప్స్, మెడల్స్, సర్టిఫికెట్స్, క్యాష్ ప్రైజ్ రూ.10,000ను పెట్లూరు రాంప్రసాద్, సర్పంచ్ వెంకటేశ్వర్లు రూ.5000/-లు అందించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు అబ్దుల్లా, నిర్వాహకులు అక్కుపల్లి శ్రీకాంత్‌యాదవ్, మహేష్‌యాదవ్, పీడీ కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.


విజేత జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న ముఖ్యఅతిథులు

# పిఆర్‌సి జీఓలపై విరుచుకుపడ్డ ఉద్యోగులు

- వేలాదిమందితో భారీ ర్యాలీ
- కలెక్టరేట్ వద్ద మహాధర్నా

రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన పిఆర్‌సి జిఓల వల్ల ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఒరిగేదేమీ లేదని, ప్రభుత్వం మొండివైఖరి వదిలిపెట్టి వెంటనే ఆ జిఓలను రద్దుచేసి పాత హెచ్ఆర్ఏ శ్లాబ్‌లను కొనసాగించాలని పెద్దఎత్తున నినాదాలు చేస్తూ నెల్లూరులో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పింఛనుదారులు ఈనెల 25న భారీర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం 11వ పిఆర్‌సి అమలు చేయడం ద్వారా జీతాలు పెంచకపోగా విషప్రచారం చేస్తోందని, ఎన్నో ఆశలతో వైకాపా ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకువస్తే ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆకాంక్షలను నీరుగార్చిందని ఉద్యోగసంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆరు డిఏలు పెండింగ్‌లో ఉంటే ఆ డిఏల ద్వారా పెరిగిన కొంత మొత్తాన్ని ఎరగా చూపిస్తూ జీతం తగ్గలేదనే దుష్ప్రచారం చేస్తోందని వారు దుయ్యబట్టారు. పిఆర్‌సి సాధనసమితి పిలుపు మేరకు నెల్లూరులోని ఏబిఎం కాంపౌండ్ వద్ద నుంచి ప్రారంభమైన ర్యాలీ గాంధీ బొమ్మ కూడలి మీదుగా విఆర్‌సి, మద్రాసు బస్టాండ్ కూడలి మీదుగా కలెక్టరేట్ దాకా సాగింది. వేలసంఖ్యలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు డప్పులు మోగిస్తూ పెద్దపెట్టున నినాదాలు చేస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. కలెక్టరేట్ వద్ద మహాధర్నా నిర్వహించారు. పిఆర్‌సి సాధనసమితి నాయకులు అల్లం పాటి పెంచలరెడ్డి, ఏనుగ రమణారెడ్డి, చేజర్ల సుధాకర్‌రావు, మన్నేపల్లి పెంచలరావు, ఫ్యాప్టో ఛైర్మన్ ఆర్.మురళీధర్ తదితర నాయకులంతా ర్యాలీలో పాల్గొని ప్రభుత్వం తీరుపై ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. అశుతోష్‌మిశ్రా కమిటీ సిఫార్సులను కాకుండా ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి సారధ్యంలో అధికారుల కమిటీని నియమించి ఉద్యోగులకు తీవ్రమైన నష్టం కలిగించారని, ప్రభుత్వం తన చీకటి జీఓల ద్వారా ఉద్యోగులను అంధకారంలోకి నెట్టిందన్నారు. 27శాతం ఉన్న మధ్యంతర భృతిని 23 శాతానికి తగ్గించడం దారుణమన్నారు. హెచ్ఆర్ఏలోనూ కోత పెట్టారన్నారు. దీంతో వేతనాలు తగ్గిపోయే పరిస్థితి ఏర్పడిందని, దేశంలో ఏక్కడా లేనివిధంగా రివర్స్ పిఆర్‌సి పేరుతో ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల జీతాల్లో కోత విధించడం అన్యాయమని మండిపడ్డారు. ప్రభుత్వంతో తాము ఘర్షణ పడడం లేదని, మెరుగైన పిఆర్‌సిని మాత్రమే కోరుకుంటున్నామని చెప్పారు. ఇకనైనా ప్రభుత్వం వెంటనే ఆ జీఓలను రద్దుచేయాలని లేకుంటే ఆ ఉత్తర్వులు రద్దు చేసేవరకు ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ మహాధర్నాలో ఏపిటిఎస్ఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.కిరణ్ కుమార్, ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకుడు ఐ.లక్ష్మీనారాయణ, ఉద్యోగ సంఘాల నాయకులు బాబురెడ్డి, చిట్టేటి రమేష్, బి.మురళి, సిపిఎస్ ఉద్యోగ సంఘాల నాయకులు, కాంట్రాక్ట్ ఉద్యోగ సంఘాల నాయకులు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘాల నాయకులు పాల్గొన్నారు. సిపిఐ, సిపిఎం నాయకులు తమ పార్టీల తరఫున సంఘీభావం ప్రకటించారు.



# ఏపీ జెన్‌కోను కాపాడుకోవాలి - సిపిఎం పిలుపు

ఏపి జెన్‌కో సంస్థను ప్రైవేటీకరించడాన్ని అడ్డుకుంటామని, దానిని కాపాడుకోవాలని సిపిఎం నాయకులు ప్రజలకు పిలుపునిచ్చారు. ఈనెల 25న నెల్లూరులోని సిపిఎం కార్యాలయంలో జెన్‌కో జేఏసి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ నేలటూరు థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని ప్రైవేటుపరం చేయాలన్న ఆలోచనలు మానుకోవాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో సిపిఎం నాయకులు చంద్ర రాజగోపాల్, రమణయ్య, పి.సుధాకర్, సిహెచ్ సుధాకర్, రమణరావు, గోగుల శ్రీనివాసులు, దయాకర్, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# సర్వశక్తి ప్రదాయిని.. కోవూరు గ్రామదేవత 'నాగవరప్పమ్మ'

***దుర్గాదేవి అంశతో ఉద్భవించిన గ్రామశక్తుల్లో మహిమాన్వితశక్తులున్న గ్రామదేవతలు అనేకమంది ఉన్నారు. అలాంటి దేవతామూర్తుల్లో నాగవరప్పమ్మ అమ్మవారొకరు. ఎంతో పురాతన కాలం నుంచి అనేక గ్రామాల్లో భక్తులు నాగవరప్పమ్మను ఎంతో భక్తితో కొలుస్తుంటారు. నెల్లూరు జిల్లాలోనూ నాగవరప్పమ్మ అమ్మవారికి పలుచోట్ల ఆలయాలున్నాయి. ఇప్పటికీ మండల కేంద్రమైన కోవూరు నడిబొడ్డున ఎంతో ప్రాచీనకాలం నుంచి నాగవరప్పమ్మ దేవాలయం ఉంది. శత్రుసంహారిణిగా, అరివీర భయంకరిగా అమ్మవారు ప్రతీతి. కోవూరు గ్రామదేవత కూడా అనాదిగా నాగవరప్పమ్మ అమ్మవారే. కోవూరులో నాగవరప్పమ్మ అమ్మవారి ఆలయ ఆవిర్భావ చరిత్ర గురించి స్థానిక కథనాలు ఎంతో ఆసక్తికరం.***







## మన దేవాలయాలు (84)

కోవూరు..నెల్లూరు పెన్నానదికి ఆవల ఒడ్డున ఉన్న సంపన్నమైన ఊరు. వరి పంటకు పెట్టింది పేరు. ముక్కారు పండే భూములు, సస్యశ్యామలమైన ప్రాంతంగా ఉన్న కోవూరు ఎంతో కాలం నుంచి ఆధ్యాత్మిక భక్తితత్వానికి కూడా నిలయంగా ఉంది. మనుమసిద్ధి మహారాజు సింహపురిని పాలించే కాలంలో, కోవూరుకు సమీపంలోనే ఉన్న పాటూరు గ్రామం కవిబ్రహ్మ తిక్కన, ఖడ్గతిక్కన వంటి యోధులకు పురిటిగడ్డ. నాటి రాజుల పాలనలో ఈ ప్రాంతాన్ని సకల జనరంజకంగా పాలించేవారు. అంతకు ముందునుంచి కూడా..ఎప్పుడో వేలాది సంవత్సరాల క్రితం ఈ ప్రాంతమంతా దట్టమైన అడవిప్రాంతంగా ఉండేదని, ప్రధానంగా కోయజాతి వారు అక్కడ ఎక్కువగా నివసించేవారని, అందువల్లనే ఆ ఊరికి 'కోయలూరు' అనే పేరుండేదని అంటుంటారు. అదే ఆ తర్వాత కోవూరుగా మారిందని కూడా స్థానికులు చెప్తుంటారు. కోయజాతి వారు ప్రత్యేకించి తమ ఇలవేలుపుగా నాగవరప్పమ్మ అమ్మవారిని ఎంతో భక్తిశ్రద్ధలతో కొలిచేవారట. నాటి ప్రాచీన చరిత్రకు సాక్ష్యంగా నేటికీ నాగవరప్పమ్మ దేవాలయం చెక్కుచెదరకుండా నిలిచే ఉంది. నాటి రాజుల కాలంలో ఈ ఆలయానికి ఎంతో వైభవం ఉండేదని అంటారు. శత్రువులను ఓడించి సకల విజయాలను చేకూర్చే గ్రామశక్తిగా అమ్మవారిని భావిస్తూ అప్పట్లో రాజులు, సేనాధిపతులు నాగవరప్పమ్మను దర్శించుకుని పూజలు చేసేవారని, అమ్మవారిని మొక్కుకున్న వారికి అన్నీ విజయాలే కలిగేవని చెప్తుంటారు. అప్పట్లో రాజవైద్యులు ఈ ఆలయాన్ని నిర్వహించే వారని అంటారు. ఇప్పటికీ తరతరాలుగా వారి వంశస్తులే అమ్మవారికి పూజలు చేస్తుంటారని గ్రామస్తులు చెప్తున్నారు.

### అయిదు శతాబ్దాల నాటి అపురూపమైన ఆలయం

నాగవరప్పమ్మ అమ్మవారి విశిష్టత అంతా ఇంతా కాదు. సర్వశక్తి ప్రదాయినిగా, భక్తాభీష్ట వరప్రదాయినిగా అమ్మవారు ఎంతో ప్రసిద్ధి. అందులోనూ అమ్మవారు మహాశక్తిదేవత. సాక్షాత్తూ ఆ దుర్గామహాదేవి అంశతో అమ్మవారు ఆవిర్భావించారని గ్రామస్తులు చెప్తుంటారు. దాదాపు అయిదు వందల సంవత్సరాలకు పైగానే ఈ ఆలయం ఉన్నట్లు చరిత్ర. కోవూరులో అమ్మవారి ఆలయం ఆనాటి నుంచి భక్తాదుల పూజలందుకుంటోంది. నేటికీ ఆలయం కోవూరు నడిబొడ్డున విశాలమైన ప్రదేశంలో సర్వాంగసుందరంగా ఉంటుంది. గర్భాలయంలో అమ్మవారు చతుర్భుజిగా అత్యంత వైభవంగా అలరారుతుంటారు. ఒక చేతిలో ఢమరుకం, మరో చేతిలో శూలం, ఇంకో చేతిలో ఖడ్గం, నాల్గవ చేతిలో కుంకుమ భరిణ ఉంటాయి. కోరుకున్న వరాలనిచ్చే దేవతగా, ఆపదలు గట్టెక్కించే అమ్మవారిగా చల్లనితల్లి నాగవరప్పమ్మ గ్రామస్తులందరిని తన కరుణాకటాక్ష వీక్షణాలతో కరుణిస్తూనే ఉంది. పంటలకు చీడపీడలున్నా, ఇళ్ళలో అశుభాలు తొలగిపోవాలన్నా, సంతానం కావాలన్నా, వివాహాది శుభకార్యాలు జరగాలన్నా.. ఆపదల నుంచి గట్టెక్కాలన్నా అనాదిగా భక్తులంతా నాగవరప్పమ్మ అమ్మవారికి మొక్కుకుంటూ ఉంటారు. ఎంతో మహిమగల శక్తిస్వరూపిణి అయిన నాగవరప్పమ్మ అమ్మవారిని భక్తితో పూజిస్తే జీవితాల్లో కష్టాలు తొలగిపోయి.. శుభాలు కలుగుతుంటాయని వేరే చెప్పనక్కర లేదు.

### అంగరంగ వైభవం.. నవరాత్రి ఉత్సవాలు

శక్తిదేవత అయిన నాగవరప్పమ్మ అమ్మవారికి నిత్యపూజలు వైభవంగా జరుగుతుంటాయి. ఆలయ వంశపారంపర్య అర్చకులు విశ్వనాథం సుబ్బరామయ్య స్వామి ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష అలంకారాలు, విశిష్టపూజలు, అభిషేకాలు నిర్వహిస్తుంటారు. ప్రతి బుధవారం గ్రామస్తులు, అన్ని వర్గాల ప్రజలు, భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి భజనలు చేస్తుంటారు. నవరాత్రి వచ్చిందంటే చాలు అమ్మవారి ఆలయం దేదీప్యమానంగా వెలిగిపోతుంటుంది. శోభాయమానమైన అలంకారాలతో ఆలయంలో అమ్మవారి శోభ చెప్పనలవి కాదు. ఒక్క కోవూరు నుంచే కాక చుట్టుపక్కల అనేకప్రాంతాల నుంచి భక్తులు వచ్చి కరుణామయి.. నాగవరప్పమ్మ అమ్మవారిని దర్శించుకుని తరిస్తుంటారు.




# 'నాటా' నూతన అధ్యక్షుడిగా డాక్టర్ కోర్సపాటి శ్రీధర్‌రెడ్డి



అమెరికా వైయస్సార్‌గా అక్కడి తెలుగువారు ఆప్యాయంగా పిలుచుకునే డాక్టర్ ప్రేమసాగర్‌రెడ్డి సారధ్యంలో దశాబ్ద కాలం క్రితం పురుడు పోసుకుని అనతికాలంలోనే అఖండ పేరు సంపాదించుకున్న తెలుగు సంస్థ 'నార్త్ అమెరికన్ తెలుగు అసోసియేషన్' (నాటా). అమెరికాలో ఉన్న తెలుగు వారెందరికో మేమున్నామంటూ తమ సేవలందిస్తున్నారు నాటా బృందం. డాక్టర్ ప్రేమ్‌రెడ్డి ఇస్తున్న స్ఫూర్తితో అటు అమెరికాతో పాటు, ఇటు భారతదేశంలోని తెలుగు రాష్ట్రాలలో కూడా నాటా వేదికగా సేవా పరిమళాలను గుభాళింపజేస్తున్నారు. 2012 నుండి ప్రతీ రెండేళ్ళకు నాటా ద్వైవార్షిక సభలను 2018 వరకూ ఘనంగా నిర్వహిస్తూ వచ్చారు. అయితే 2020లో ప్రపంచాన్ని ఆవహించిన కరోనా మహమ్మారి పుణ్యమా అని 2020, 2022 సంవత్సరాలలో జరగాల్సిన వేడుకలను వాయిదా వేశారు. ఇప్పుడు తాజాగా 2023లో డల్లాస్ వేదికగా వార్షిక సంబరాలను జరపడానికి నిర్ణయించారు.

## అధ్యక్షుడిగా భాధ్యతలు చేపట్టిన డాక్టర్ శ్రీధర్‌రెడ్డి

2018లో అధ్యక్షుడిగా ఎన్నిక కాబడిన గోసల రాఘవరెడ్డి కూడా నెల్లూరీయుడే. ఆయన ఆధ్వర్యంలో జరగవలసిన వార్షిక వేడుకలు వాయిదా పడుతూ వస్తుండడంతో, భవిష్యత్ ఏడాదికి అధ్యక్షుడిగా 2018లోనే ఎంపిక కాబడిన మరో నెల్లూరీయుడు డాక్టర్ కోర్సపాటి శ్రీధర్‌రెడ్డి ప్రమాణస్వీకారం కూడా వాయిదా పడుతూ వచ్చింది. ఇప్పటికే ఆలస్యం అవుతుండడంతో వార్షిక సమావేశంతో సంబంధంలేకుండా నాటా కార్యవర్గసభ్యులతో కూడిన నాటా బృందం జనవరి 23వతేదీన అమెరికాలోని 'లాస్ వేగస్' నగరంలో డాక్టర్ ప్రేమ్‌రెడ్డి అధ్యక్షతన సమావేశమయ్యింది. సంస్థ పూర్వ అధ్యక్షుడు గోసల రాఘవరెడ్డి నుండి అధ్యక్ష బాధ్యతలను డాక్టర్ కోర్సపాటి శ్రీధర్‌రెడ్డికి ఈ బృందం అప్పజెప్పింది.

ఆనంద సంబరంగా జరిగిన ఈ సమావేశానికి, నాటా అడ్వైజరీ కమిటీ ఛైర్మెన్ ఎమిరేటర్స్ డా.ప్రేమ్‌రెడ్డితోపాటు అడ్వైజరీ కౌన్సిల్ ఆదిశేషారెడ్డి, డా. మోహన్ మల్లాం, డా. సంజీవరెడ్డి, డా.ప్రసాద్ జీ రెడ్డి, డా.చంద్రశేఖర్ నరాల తదితర ప్రముఖులు హాజరయ్యారు. 2022-2023కు గాను 'నాటా' కొత్త కార్యవర్గాన్ని ఈ సందర్భంగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## 2023లో డల్లాస్‌లో నాటా ఉత్సవాలు

ప్రతి రెండేళ్లకోసారి అంగరంగ వైభవంగా నిర్వహించే నాటా మెగా కన్వెన్షన్‌ను 2023 జులై నెలలో అత్యంత వైభవంగా నిర్వహించాలని తీర్మానించారు. కోవిడ్ కారణంగా గత రెండేళ్ళుగా ఈ ఉత్సవం వాయిదాపడుతూ వస్తుంది. అయితే పాండమిక్ ఎండమిక్‌గా మారుతోందని నిపుణులు అంచనా వేస్తున్న తరుణంలో జులై 2023లో డల్లాస్ వేదికగా మెగా కన్వెన్షన్‌ను అంగరంగ వైభవంగా నిర్వహించాలని భావిస్తున్నట్లు కొత్త అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ కోర్సపాటి శ్రీధర్ రెడ్డి తెలిపారు. ప్రవాసాంధ్రులను ఒక్కతాటిపైకి తేవడంతో పాటు, వారికి సంబంధించిన అన్ని అంశాలు ఈ సమావేశాలలో చర్చిస్తామని, అలాగే రెండు తెలుగు రాష్ట్రాల్లో నాటా ఆధ్వర్యంలో స్వచ్ఛంధ, సేవా కార్యక్రమాలను చేపడతామని శ్రీధర్‌రెడ్డి చెప్పారు. అమెరికాలో నివసించే తెలుగు ప్రజలందరికీ నాటా ఎప్పుడూ అండగా ఉంటుందని, తమ సంస్థ ద్వారా విస్తృతంగా మరిన్ని కార్యక్రమాలు చేపడతామని ఆయన అన్నారు. డాక్టర్ ప్రేమ్‌రెడ్డి స్ఫూర్తి, సహకారాలతో న్యూజెర్సీలో నాటా కార్యాలయం కోసం త్వరలోనే సొంత శాశ్వత భవనం నిర్మిస్తామని తెలిపారు.

## 2022 - 2023కు గాను ఎంపిక కాబడిన నాటా నూతన కార్యవర్గం :

అధ్యక్షుడిగా డాక్టర్ కోర్సపాటి శ్రీధర్‌రెడ్డి, కాబోయే అధ్యక్షుడిగా హరి వేల్కూరు, కార్యనిర్వహణ ఉపాధ్యక్షుడిగా ఆళ్ళ రామిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా గండ్ర నారాయణరెడ్డి, కోశాధికారిగా సోమవరపు శ్రీనివాసులురెడ్డి, సంయుక్త కోశాధికారిగా మందపాటి శరత్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా సతీష్ నరాల ఎంపిక కాగా మాజీ అధ్యక్ష హోదాలో డాక్టర్ గోసల రాఘవరెడ్డి కూడా కమిటీలో ఉన్నారు. వీరితో పాటు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా అంజిరెడ్డి సాగంరెడ్డి, నేషనల్ కన్వెన్షన్ అడ్వైజర్‌గా శ్రీనివాసులురెడ్డి కోట్లూరి, అంతర్జాతీయ ఉపాధ్యక్షుడిగా నగేష్ ముక్కమల్ల, అంతర్జాతీయ ఉపాధ్యక్షులుగా దర్గా నాగిరెడ్డి, లక్ష్మీనరసింహారెడ్డి కొండా, శ్రీధర్‌రెడ్డి తిక్కవరపు, సురేన్ బత్తినపట్ల, సురేష్‌రెడ్డి కేలు ఎంపిక కాబడ్డారు.

## డల్లాస్ కన్వెన్షన్ కమిటీ

2023లో డల్లాస్‌లో జరగబోయే వేడుక కోసం ఒక ప్రత్యేక కమిటీని కూడా నియమించారు. ఈ కమిటీలో గిరీష్ రామిరెడ్డి కన్వీనర్‌గానూ, డా.రామిరెడ్డి బూచిపూడి కో-ఆర్డినేటర్‌గానూ, కృష్ణ కోడూరు కో-కన్వీనర్‌గానూ, భాస్కర్ గండికోట కో-ఆర్డినేటర్‌గానూ, రమణారెడ్డి క్రిష్టపాటి డెప్యూటీ కన్వీనర్‌గానూ, మల్లిక్ అవుల డిప్యూటీ కో-ఆర్డినేటర్‌గానూ వ్యవహరిస్తారు. ఇండియా కో-ఆర్డినేటర్స్‌గా డీవీ కోటిరెడ్డి, ఆళ్ళ నవీన్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, విష్ణు కోటంరెడ్డిలను నియమించారు.

## • సమర్ధుడికి సముచిత స్థానం

# అందరివాడికి అందలం

నాటా నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ కోర్సపాటి శ్రీధర్‌రెడ్డికి నాయకత్వపు లక్షణాలు పుష్కలంగా కలిగిన అందరివాడుగా పేరుంది. చేపట్టిన పని ఏదైనా అనుకున్న స్థాయికి మించి చేసిచూపించడంలో ఆయన దిట్ట. అపార మానవ సంబంధాలు కలిగిన ఆత్మీయ వ్యక్తిగా అమెరికాలోనే కాకుండా భారతదేశంలో కూడా శ్రీధర్‌రెడ్డిని చాలామంది అభిమానిస్తారు. ఎంతోమందికి మంచి స్నేహితుడిగా, హితుడిగా, సన్నిహితుడిగా, గైడ్‌గా, ఫిలాసఫర్‌గా మార్గనిర్దేశకత్వం చేసి స్ఫూర్తిదాయకంగా నిలిచారు శ్రీధర్‌రెడ్డి.

## ఆదర్శనీయమైన ప్రస్థానం...

ఆయన స్వగ్రామం నెల్లూరుజిల్లా బిట్రగుంట. 7వతరగతి వరకు సొంత ఊర్లో చదువుకున్న శ్రీధర్‌రెడ్డి, ఆ తరువాత డిగ్రీ వరకు కావలి జవహర్‌భారతిలో చదువుకున్నారు. తిరుపతి ఎస్.వీ.యూనివర్సిటీలో ఇంజనీరింగ్‌లో మాస్టర్స్ తరువాత ఎన్విరాన్మెంటల్ కెమిస్ట్రీలో పీహెచ్‌డి చేసి డాక్టరేట్ పొందారు. ఆ తరువాత అనుకోకుండా ఆయన ప్రస్థానం కొన్ని సంవత్సరాలు జమైకాలో కొనసాగింది. అక్కడ జమైకా ఆరోగ్య శాఖలో ముఖ్య ఎన్విరాన్మెంటల్ ఇంజనీరుగా సమర్ధవంతంగా పనిచేసి ఆ దేశ ప్రభుత్వపెద్దల ప్రశంస లందుకున్నారు. 1996లో అక్కడినుండి తన మజిలీని అమెరికాకు మార్చుకుని స్థిరపడిపోయారు. అమెరికాకు వెళ్ళిన కొద్దిరోజులకే చురుకైన భారతీయ యువకుడిగా అక్కడి భారతీయులను ఆకర్షించారు. సేవా దృక్పథం, సామాజిక స్పృహ ఉన్న వ్యక్తిగా పలువురి ప్రశంసలు అందుకున్నారు. ఆయన అందించిన సేవలకు గుర్తుగా 2010లో 'రాష్ట్రీయ సమ్మాన్', 'హింద్ రతన్' అవార్డులను అందుకున్నారు.

2002లో జరిగిన 'ఆటా' సమావేశానికి కార్యదర్శిగా పనిచేశారు. 2009లో తెలుగు అసోసియేషన్ అఫ్ నార్త్ టెక్సాస్(టాంటెక్స్)కి అధ్యక్షుడిగా తన సేవలందించారు. 50వేల మందికిపైగా భారతీయులు సభ్యులుగా ఉన్న 'ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ నార్త్ టెక్సాస్'కి 2012లో అధ్యక్షుడిగా పనిచేసిన తరుణంలో అటు అమెరికాలోనే కాకుండా ఇటు భారతదేశంలో సైతం పలు రాష్ట్రాల, ప్రాంతాల వ్యక్తులను శ్రీధర్‌రెడ్డి ఆకర్షించారు. ఇప్పటికీ అనేక భారతీయ సంస్థల్లో ఆయన సభ్యులుగా ఉన్నారు.

సేవా దృక్పథం, నాయకత్వపు కోణం వంటి లక్షణాలు కలిగిన శ్రీధర్‌రెడ్డి ఎవరికి ఎక్కడ ఏ అవసరం, లేదా సమస్య వచ్చినా నేనున్నానంటూ ముందుకొస్తారు. ముఖ్యంగా అమెరికాకు వెళ్ళే తెలుగువారికీ, అక్కడ స్థిరపడిన భారతీయులకి నిత్యం అందుబాటులో ఉంటారు.

చిన్నతనంలో గ్రామీణ వాతావరణంలో తండ్రి గోపాలరెడ్డిలో గమనించిన సేవా గుణం, అమ్మ సీతమ్మలో చూసిన దాతృత్వం శ్రీధర్‌రెడ్డిని ప్రభావితం చేశాయని చెప్పవచ్చు. తాను పుట్టిన గ్రామ అవసరాలను తీర్చడానికి నిత్యం తనవంతు ఆర్ధిక సహాయం అందిస్తూనే ఉంటారాయన. తమ గ్రామంలోని వెంకటేశ్వరస్వామి వారి ఆలయ అభివృద్ధి కోసం చేయూతనందిస్తూ.. గ్రామంలో మరో ఆలయ నిర్మాణానికి కూడా తనవంతు సహాయసహకారాలు అందిస్తూ.. ఆయనలో ఉన్న ఆధ్యాత్మికతత్పరతను కూడా చాటుకుంటున్నారు.

భారతీయ సంస్కృతి, సంప్రదాయాలతో పాటు తెలుగువారి గొప్పదనాన్ని, తెలుగుతనంలోని కమ్మదనాన్ని భావితరాలకు తెలియజేయాలన్నది ఆయన ఆశయం. అమెరికాలో స్థిరపడిన తెలుగువారి పిల్లలకి తెలుగు భాషా ప్రాముఖ్యత, తెలుగు రాష్ట్రాలకు ఉన్న ప్రాధాన్యతను తెలిపి, వారిలో తమ స్వగ్రామాల పట్ల ఆసక్తిని పెంపొందింప చేయాలన్నది కూడా శ్రీధర్‌రెడ్డి లక్ష్యం.

శ్రీధర్‌రెడ్డి నాయకత్వంలో నార్త్ అమెరికన్ తెలుగు అసోసియేషన్ తెలుగువారికి మరింత చేరువై, ఉన్నత సేవాసంస్థగా అవతరిస్తుందని ఆకాంక్షిస్తూ, అభినందనలు తెలుపుతోంది 'లాయర్'.

# చిన్నబోయిన నెల్లూరు

(మొదటి పేజీ తరువాయి)

తిరుపతి కేంద్రంగా 'బాలాజీ జిల్లా', పార్వతీపురం కేంద్రంగా 'మన్యం జిల్లా', పాడేరు కేంద్రంగా 'అల్లూరి సీతారామ రాజు జిల్లా', విజయవాడ కేంద్రంగా 'ఎన్టీఆర్ జిల్లా', పుట్టపర్తి కేంద్రంగా 'సత్యసాయి జిల్లా', రాయచోటి కేంద్రంగా 'అన్నమయ్య జిల్లా', అమలాపురం కేంద్రంగా 'కోనసీమ జిల్లా', నరసరావుపేట కేంద్రంగా 'పల్నాడు జిల్లా' అంటూ ప్రాంతీయ ప్రాముఖ్యతకు ప్రాధాన్యతను కల్పిస్తూ జిల్లాల పేర్లను నిర్ణయించారు.

ఇప్పటికిప్పుడు హడావుడిగా ఈ కార్యక్రమాన్ని చేపట్టడానికి కారణాలు అనవసరం. ఉద్యోగుల సమ్మె అంశాన్ని పక్కదోవ పట్టించడానికి అని కొందరంటే, కేంద్ర ప్రభుత్వం జిల్లాలవారీగా మంజూరు చేస్తున్న సంక్షేమ పథకాలను సంపూర్ణంగా అందుకోవడానికే అని మరికొందరు అభిప్రాయపడుతున్నారు. త్వరలో మంత్రివర్గ ప్రక్షాళన జరగనున్న నేపథ్యంలో కూడా ఈ విభజన చేపట్టారని కూడా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇందులో ఎవరెవరి అభిప్రాయాలు, ఆలోచనలు వారివి. అవి ఇక్కడ అప్రస్తుతం. ప్రక్రియ మొదలైపోయింది, మంత్రి మండలి ఆమోదం తెలిపింది. రాజపత్రాలు విడుదలవుతున్నాయి. పరిపాలన సౌలభ్యం కోసమే తెలంగాణ తరహాలో ఈ విభజన చేపట్టారన్నది అక్షర సత్యం. ముప్పైకిపైగా జిల్లాలు ఏర్పడినందున పరిపాలనా సౌలభ్యం పెరిగిందా...? లేక ఖర్చులు పెరిగాయా...?? కొత్త జిల్లాల ఏర్పాటు వల్ల బంగారు తెలంగాణ వచ్చిందా... లేదా...? అన్నది అక్కడి మేధావులే తేల్చాలి.

## సర్వేపల్లి మిగిలింది... కందుకూరు కలిసింది!

ఇక నెల్లూరుజిల్లా విషయానికి వస్తే పార్లమెంటు నియోజకవర్గాలను ప్రామాణికంగా తీసుకుంటే సర్వేపల్లి కూడా బాలాజీ జిల్లాకి వెళ్ళిపోవాలి. అయితే ఇక్కడ ప్రజల మనోభావాలను గౌరవించారా...? శాసనసభ్యుడు కాకాణి గోవర్ధన్ రెడ్డి అభ్యర్ధనని మన్నించారా..?? లేక పోర్టు యాజమాన్య అవసరాలను గుర్తించారా..??? తెలియదు కానీ సర్వేపల్లిని మాత్రం నెల్లూరులోనే ఉంచారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన షార్ రాకెట్ కేంద్రం, కిలకిలా రావాలతో యాత్రికులను పులకింపజేసే పెలికాన్ పక్షుల విడిది కేంద్రం పులికాట్ సరస్సు, భక్తులను కరుణించే చెంగాళమ్మ, భారతదేశంలోనే ప్రతిష్టాత్మకంగా అభివృద్ధి చెందుతున్న శ్రీసిటీ, టెక్స్‌టైల్ పార్క్‌కి వేదికగా ఉన్న మేనకూరు సెజ్... ఇలాంటివన్నీ సూళ్లూరుపేట నియోజకవర్గంతో కలిసి బాలాజీ జిల్లా పరిధిలోకి వెళ్లనున్నాయి. ఇక గూడూరు నియోజకవర్గంలోని చింతవరం పారిశ్రామికవాడ, మైకా గనులు, సిలికా సిరులు, జిల్లాలో మొట్టమొదటి ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాల ఎన్.బి.కె.ఆర్ కూడా ఆ శ్రీవారి పాదాల చెంతకు చేరనున్నాయి. అంతర్జాతీయంగా పేరు గాంచిన వెంకటగిరి చీరలు ఇక నెల్లూరు జిల్లావి కావు. వెంకటగిరి పోలేరమ్మ తల్లి ఆలయం, స్పెషల్ పోలీస్ బెటాలియన్ శిక్షణా కేంద్రం కూడా బాలాజీ జిల్లాలోకి వెళ్లిపోనున్నాయి.

సూళ్లూరుపేట, గూడూరు, వెంకటగిరి నియోజకవర్గాలు నెల్లూరు నుండి విడిపోవడంతో నెల్లూరు పారిశ్రామికంగా అనాధగా మారిందని చెప్పొచ్చు. నెల్లూరు నగరం, రూరల్, కోవూరు, కావలి, ఆత్మకూరు, ఉదయగిరితో పాటు సర్వేపల్లిని నెల్లూరులోనే ఉంచి ప్రకాశం జిల్లాలోని కందుకూరుని కూడా కలుపుతున్నారు. తూర్పువైపున బంగాళా ఖాతం, పడమట వైపున సోమశిల డ్యామ్, మధ్యలో పంట పొలాలు, బీడు భూములు నెల్లూరుకు మిగిలాయి. గుడ్డిలో మెల్లలా సర్వేపల్లి ఉంది కాబట్టి కొంత ఊరట లభించిందని జిల్లా వాసులు భావిస్తున్నారు. మొత్తానికి జిల్లాల పునర్విభజనలో నెల్లూరు చిన్నబోయిందనడంలో ఎలాంటి సందేహం లేదు.

# బరితెగించిన ఎర్రచందనం స్మగ్లర్లు

- పోలీసులపై రాళ్ళు, గొడ్డళ్ళు
- ధైర్యంగా ఎదుర్కొన్న జిల్లా పోలీసులు
- 55 మంది దుండగుల అరెస్ట్



ఎర్రచందనం స్మగ్లర్లు బరితెగించిపోయారు. తమకు అడ్డం వచ్చిన పోలీసులపై రాళ్ళు, గొడ్డళ్ళు విసిరారు. వాహనాలను పోలీసులపై ఎక్కి తొక్కించేందుకు కూడా ప్రయత్నించారు. ఈ వీరంగమంతా ఇటీవల నెల్లూరుజిల్లా రాపూరు అడవుల్లో జరిగింది. ఎట్టకేలకు పోలీసులు చాకచక్యంగా ఆ ముఠానంతా అదుపులోకి తీసుకుని వారి ఆట కట్టించారు. సినిమా ఫక్కీలో జరిగిన ఈ ఘటన, జిల్లాలో సంచలనం కలిగించింది. జిల్లా ఎస్పీ సిహెచ్ విజయారావు ఆ వివరాలను విలేకర్లకు వివరించారు. చిత్తూరుజిల్లా విబిపురం మండలంలోని ఆరె గ్రామానికి చెందిన దాము, కుప్పన్న సుబ్రహ్మణ్యంకు పుదుచ్చేరికి చెందిన పెరుమాళ్ళు వేలుమలైతో పరిచయం ఉంది. వేలుమలై, ఆయన బావమరిది రాధాకృష్ణన్ పళనిని దాముకు పరిచయం చేశాడు. వీరంతా కలిసి కూలీలను వెంటబెట్టుకుని గూడూరుకు వచ్చి, కడపజిల్లా రైల్వేకోడూరుకు చెందిన చంద్రశేఖర్‌ను కలిశారు. ఆయన సహకారంతో రాపూరు అడవుల్లో ఉన్న ఎర్రచందనం చెట్లను నరికి వాటిని దుంగలుగా చేసుకుని లారీలో వేసుకుని తిరిగి వెళ్ళిపోతుండగా, ఈ సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే రంగంలోకి దిగారు. రెండు వాహనాల్లో పోలీసుబృందాలు వెళ్ళి చెన్నై జాతీయ రహదారి వద్ద వాహనాల తనిఖీలను ముమ్మరం చేశారు. ఎర్రచందనం దుంగలతో కూలీలు, స్మగ్లర్లు వాహనాల్లో వస్తున్నట్లు గుర్తించి, వారిని చిల్లకూరు మండలం బూదనం గ్రామం వద్ద నిలిపేందుకు పోలీసులు ప్రయత్నించడంతో, స్మగ్లర్లు వీరంగం చేస్తూ వారి వాహనాలను పోలీసులపైకి ఎక్కించేందుకు ప్రయత్నించారు. తప్పించుకుపోవడానికి పోలీసులపై రాళ్ళను, గొడ్డళ్ళను విసిరారు. ఈ ఘటనలో పలువురు కానిస్టేబుళ్లకు గాయాలు తగిలాయి. అయినా పోలీసులు పట్టువిడవకుండా ఎంతో చాకచక్యంగా స్మగ్లర్ల వాహనాలను చుట్టుముట్టి, ఆ జీపుల్లో ఉన్న నిందితులందరినీ అదుపులోకి తీసుకున్నారు. వారినుంచి 17.38 లక్షల విలువైన 45 ఎర్రచందనం దుంగలతో పాటు, 24 గొడ్డళ్ళు, 31 సెల్‌ఫోన్లు, 3 బరిసెలు, రంపాలు, ఒక లారీ, టయోటో కారు, 75,230 రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఎర్రచందనం స్మగ్లింగ్ ముఠా సభ్యులను, కూలీల దాడులను ధైర్యంగా అడ్డుకుని వారిని అరెస్టు చేసిన గూడూరు డిఎస్పీ రాజగోపాల్‌రెడ్డి, రూరల్ సిఐ శ్రీనివాసరెడ్డి, వెంకటగిరి సిఐ నాగమల్లేశ్వరరావుతో పాటు పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ విజయారావు అభినందించారు.

# క్యాన్సర్ బాధితునికి.. ప్రసన్న సాయం

- 50వేలు అందించిన కోవూరు ఎమ్మెల్యే



ఇందుకూరుపేట మండలంలోని సోమరాజుపల్లి గ్రామంలో క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న 14 సంవత్సరాల గోని నానికి వైద్యచికిత్సల కోసం కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి ఇటీవల రూ.50 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. తమ తండ్రి స్వర్గీయ నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా నెల్లూరులోని తన నివాసంలో నాని కుటుంబసభ్యులకు ఆ సాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో దేవిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, జడ్పీటీసీ బందెల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులు క్రీడల్లోనూ రాణించాలి



నెల్లూరుసిటీ జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న జిల్లా ఎస్పీ విజయారావు, నుడా ఛైర్మెన్ ముక్కాల ద్వారకానాథ్

ప్రజలకు సమాచారం అందించేందుకు నిరంతరం శ్రమిస్తున్న జర్నలిస్టులు క్రీడల్లోనూ రాణించాలని జిల్లా ఎస్పీ సిహెచ్ విజయారావు ఆకాంక్షించారు. ఇటీవల నెల్లూరులోని ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో జేశాప్ క్రికెట్ పోటీల విజేతలకు జరిగిన బహుమతి ప్రదానోత్సవంలో ఎస్పీ పాల్గొన్నారు. పని ఒత్తిడిని అధిగమించేందుకు క్రీడలు ఎంతగానో దోహదం చేస్తాయని ఆయన అన్నారు. జర్నలిస్టులు క్రీడల్లో ఉత్సాహం చూపుతుండడం సంతోషకరమని ఈ కార్యక్రమంలో పాల్గొన్న జే శాప్ జిల్లా గౌరవాధ్యక్షుడు, నుడా ఛైర్మెన్ ముక్కాల ద్వారకానాథ్ అన్నారు. రంజీ మాజీ క్రీడాకారుడు మలిరెడ్డి కోటారెడ్డి, ఏపి చెస్ అసోసియేషన్ కార్యదర్శి వై.సుమన్, డిఎస్ఏ చీఫ్ కోచ్ ఆర్‌కె యతిరాజ్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. అనంతరం జే శాప్ క్రికెట్ పోటీల్లో ప్రథమస్థానం సాధించిన నెల్లూరు సిటీజట్టుకు, ద్వితీయ స్థానం పొందిన కోవూరు జట్టుకు బహుమతులు అందజేశారు. మ్యాన్ ఆఫ్ ది సిరీస్ నందకిశోర్, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ సునీల్‌కుమార్‌రెడ్డిలను అభినందించారు. సింహపురి స్పోర్ట్స్ అసోసియేషన్ కార్యదర్శి నిమ్మల వీరవెంకటేశ్వర్లు, జే శాప్ రాష్ట్ర సహాయ కార్యదర్శి అబ్దుల్ రవూఫ్, వై.నరేష్, జిల్లాశాఖ ఉపాధ్యక్షుడు వెంకట్రావు, జాయింట్ సెక్రటరీ మాల్యాద్రి, ఇసి సభ్యులు ఆవుల కమలాకర్, ముజాహిద్, రాజేస్, కమ్రుద్దీన్, సుమంత్ పాల్గొన్నారు.

# ఆపద్బాంధవుడు.. మధుసూదన్‌రావు

- వందసార్లు రక్తదానం చేసి ఎందరినో కాపాడిన ఆదర్శవంతుడు



***ఒకసారి కాదు.. రెండుసార్లు కాదు.. వందసార్లు రక్తదానం చేసి తన సేవాభావాన్ని, మానవతా హృదయాన్ని చాటుకున్నాడు ఆ రక్తదాత. ఓ-ప్లస్ రక్త గ్రూపునకు చెందిన ఈ రక్తదాత ఇప్పటిదాకా నూరుసార్లు రోగులకు రక్తదానం చేసి వారి ప్రాణాలను నిలబెట్టాడు. రక్తదానం చేయడానికి ఎంతోమంది సంకోచిస్తున్న నేటి కాలంలో ఒక రక్తదాత నూరుసార్లు రక్తదానం చేయడం ఎంతైనా అభినందనీయం. ఇదెంతో అరుదైన రికార్డు కూడా. వివరాలిలా ఉన్నాయి.***

ఆయనకు 54 ఏళ్ళు. పూర్తి పేరు మదనపల్లి మధుసూదన్ రావు. సొంతూరు నెల్లూరు రూరల్ మండలంలోని ఉప్పుటూరు. రక్తదానం చేయాల్సివస్తే ముందుండే సేవాభిలాషి కలిగిన వ్యక్తి. 1985లో ఒకసారి తన రక్తసంబంధికునికి తొలిసారిగా తన రక్తాన్ని పంచాడు. ఆ తర్వాత కాలంలో రక్తదానం చేసి మరింత మందిని ఆదుకోవాలనే సత్సంకల్పంతో నెల్లూరులోని సింహపురి స్వచ్ఛంధ రక్తదాతల బృందం సభ్యుడుగా ఉంటూ ఎంతోమంది రోగులకు, బాధితులకు తన రక్తాన్ని అందించి వారికి ప్రాణదానం చేశాడు. 1997లో నెల్లూరుజిల్లా రెడ్‌క్రాస్‌లో రక్తనిధి ఏర్పడిన తర్వాత మధుసూదన్ ఆ రక్తనిధిలో బాధితుల కోసం రక్తదానం చేయడం కొనసాగించాడు. ఇటీవలే 100వ సారి రక్తదానం చేసి అందరి ప్రశంసలు అందుకున్నాడు. ఈ నూరుసార్లలో 35సార్లు మొత్తం రక్తంగా ఎక్కించడానికి 35 మంది కోసం, 22 సార్లు ప్లేట్‌లెట్స్‌ని, 43సార్లు ప్లేట్‌లెట్స్‌తో పాటు ఎర్ర రక్తకణాలు, ప్లాస్మా అందించాడు. ఇలా మొత్తంగా 100సార్లు రక్తదానం చేసి 186 మందికి తన రక్తాన్ని పంచారు. ప్రస్తుతం మధుసూదన్‌రావు నెల్లూరు రెడ్‌క్రాస్ రక్తనిధిలో రక్తసహాయ ప్రేరేపకునిగా ఉద్యోగం చేస్తున్నారు కూడా. నూరుసార్లు రక్తదానం చేయడం ఒక రికార్డు కావడం, నెల్లూరు జిల్లా వైద్యసేవా రంగ చరిత్రలో ఇంతమంది కోసం ఒక రక్తదాత ఇంతగా రక్తసహాయం చేసిన వ్యక్తి మధుసూదన్ ఒక్కరే కావడం విశేషం. ఈ సందర్భంగా మాతృసంస్థ అయిన సింహపురి స్వచ్ఛంద రక్తదాతల సంస్థ ఆనందంతో ఆయనకు శుభాకాంక్షలు చెప్తోంది, భవిష్యత్తులో కూడా ఆయన తన ఆరోగ్యాన్ని జాగ్రత్తగా పరిరక్షించుకుంటూ రక్తదానమనే మానవతా పతకాన్ని సేవాగగనంలో ఎగరేస్తూ కొత్తగా ఈ సేవారంగానికి వచ్చేవారికి ప్రేరణగా, మార్గదర్శిగా కొనసాగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామని సింహపురి స్వచ్ఛంధ రక్తదాతల బృందం వ్యవస్థాపక కార్యదర్శి తిక్కవరపు సుకుమార్‌రెడ్డి తెలియజేశారు.

# ఫ్రెండ్స్ వాకర్స్ ఆధ్వర్యంలో రిపబ్లిక్ డే వేడుకలు



నెల్లూరులోని ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 26న 73వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో అసోసియేషన్ అధ్యక్షుడు కొండూరు సుబ్బారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వాకర్స్‌కు, స్టేడియంకు వచ్చిన క్రీడాకారులకు జెండాలు అందజేసి, రిపబ్లిక్ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపి చాక్లెట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా పౌల్ట్రీ రంగ పితామహుడు పద్మశ్రీ బివిరావు 26వ వర్ధంతి కార్యక్రమాన్ని మాజీ నెక్ ఛైర్మెన్ నలుబోలు బలరామయ్య నాయుడు నిర్వహించి వాకర్స్‌కు, క్రీడాకారులకు ఉడికించిన కోడిగుడ్లను ఉచితంగా పంచారు. పౌష్టికాహారమైన కోడిగుడ్డు ప్రాధాన్యతను వివరించే క్యాలండర్‌లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ ప్రతినిధులు దాసరాజు సత్యనారాయణ, వి.వెంకటేశ్వర్లు, సోను, ఎన్.సాయిసుబ్బారావు, లక్కాకుల శ్రీనివాసులు, ఆదినారాయణరెడ్డి, అబ్దుల్‌ఖాదర్, పిచ్చయ్య, వి.రంగారావు, ఎం.భారతి, అరుణాచలం తదితరులు పాల్గొన్నారు.

# ప్రాణాలు తీసిన.. ఈత సరదా


- తెలుగుగంగ కాలువలో ఇద్దరు యువకుల మృతి



మృతిచెందిన యువకులను పరిశీలిస్తున్న పోలీసులు

సరదాగా ఈతకు వెళ్ళిన ఇద్దరు యువకులు తెలుగు కాలువలో మునిగిపోయి మృతిచెందారు. దొరవారిసత్రం మండలంలోని శ్రీనివాసపురం వద్ద ఈనెల 26న జరిగిన ఈ దుర్ఘటన స్థానికులను కలచివేసింది. మృతిచెందిన ఇద్దరిలో చైతన్య అనే యువకుడు బీటెక్ పూర్తి చేశాడు. ఇటీవలే చెన్నైలోని ఒక సంస్థలో సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా ఉద్యోగం కూడా వచ్చింది. ఈనెల 27న ఉద్యోగంలో చేరాల్సి ఉంది కూడా. ఈత సరదాతో ప్రాణాలమీదికి తెచ్చుకున్నాడు. స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పుదూరు గ్రామానికి చెందిన పెరివి జగన్(21), కొండూరి చైతన్యకుమార్(22), విష్ణు.. ఈ ముగ్గురూ స్నేహితులు. వారంతా సరదాగా ఈతకొట్టేందుకు తెలుగుగంగ కాలువ వద్దకు వెళ్లారు. ఈత కొడుతూ చైతన్య, జగన్‌లు అదుపుతప్పి కాలువలో మునిగిపోవడంతో పక్కనే ఉన్న విష్ణు వాళ్ళను కాపాడేందుకు ప్రయత్నిస్తూ తాను కూడా కాలువలో పడిపోయాడు. కేకలు వేస్తున్న విష్ణును గమనించి స్థానికులు వచ్చేసరికి అప్పటికే చైతన్య, జగన్ మృతిచెందారు. పోలీసులకు సమాచారం అందించడంతో నాయుడుపేట ఎస్ఐ కృష్ణారెడ్డి సంఘటనాస్థలానికి వచ్చి పరిశీలించారు.

# సంగం శివాలయంలో కనిపించిన.. అరుదైన గుడ్లగూబ



సంగం శివాలయంలోని నాగశిల వద్ద ఈనెల 26న ఓ అరుదైన గుడ్లగూబ కనిపించింది. ఇది చాలా ప్రత్యేకంగా ఉండి స్థానికులను ఆకట్టుకుంది. ఇది 'బార్న్' అనే గుడ్లగూబ అని, మన దేశంలో బీహార్, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో అక్కడక్కడా కనిపిస్తుంటుందని అటవీ అధికారులు చెప్పారు.

# శ్రద్ధాంజలి



జననం
28.10.1948

నిర్యాణం
22.01.2022

## స్వర్గీయ డాక్టర్ జే.పి.రెడ్డి గారు

(డాక్టర్ పెళ్ళకూరు జయప్రసాద్‌రెడ్డి)

నెల్లూరులోని ప్రముఖ చర్మ మరియు సెక్స్ వ్యాధుల నిపుణులు

సౌమ్యశీలి, స్నేహశీలి, ప్రతిభాశాలి
నిత్యం చెరగని చిరునవ్వుతో అందర్నీ పలుకరించే
ఆత్మీయదీప్తి, అనురాగమూర్తి, మహోన్నత వ్యక్తి,
మాకు మార్గదర్శకులు, మా ఇంటి దైవం

## డాక్టర్ జే.పి.రెడ్డి గారు

(డాక్టర్ పెళ్ళకూరు జయప్రసాద్‌రెడ్డి)

22.01.2022 శనివారం నాడు బెంగుళూరులోని వారి స్వగృహమునందు
పరమపదించారని తెలియజేయుటకు చింతిస్తున్నాము.

వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తూ...

భార్య : **రాధామృత**

కుమారులు - కోడళ్ళు

**పెళ్ళకూరు చైతన్యరెడ్డి - ప్రతిమరెడ్డి**

**పెళ్ళకూరు సమన్యరెడ్డి - వైష్ణవి**

మనుమడు :

**పెళ్ళకూరు సాహిత్‌రెడ్డి**

**మరియు కుటుంబ సభ్యులు**

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3.
Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com